ప్రో॥ యెనుముల చిరంజీవి
8985919087
8096949006
9133886993
YVR ఫామ్స్ నాటుకోళ్ళు & కౌజు పిట్టలు
హోల్‌సేల్ వ్యాపారం
అసిల్ నాటుకోడి పిల్లలు, కడక్‌నాథ్ గిన్నెకోడి, కౌజు పిట్టలు, టర్కి పిల్లలు అమ్మబడును.
యూనియన్ బ్యాంక్ ఎదురు, పొన్నపల్లి, చెరుకుపల్లి (మం), బాపట్ల జిల్లా.
కె.వి.పి. కాలనీ ఎదురు, లాల్‌పురం రోడ్, చుట్టుగుంట, గుంటూరు.
పవర్ గ్రిడ్ ప్రక్కన, మటన్ షాపుల దగ్గర, నున్న, విజయవాడ.
ఆర్డరుపై డోర్ డెలివరి సౌకర్యం కలదు.

ప్రజా చైతన్యమే...
# లక్ష్యం
తెలుగు దినపత్రిక

లక్ష్యం
సమస్యమీది...! పరిష్కారం మాది..!
'లక్ష్యం దిన పత్రిక' పాఠకుల అభిరుచి మేరకు ఓ వినుత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది.
మీ ప్రాంత అభివృద్ధి నేపధ్యంలో వెనుకబాటుతనానికి కారణాలు ఫోటోతో ఒక చిన్న కామెంట్ పెడితే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆయా ప్రాంత 'లక్ష్యం' పాత్రికేయ బృందం పరిశీలించి వార్త రూపంలో పత్రికాముఖంగా సమస్యను రాజకీయ, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా కృషి చేస్తుంది.
ప్రజాచైతన్యమే లక్ష్యం గా ....
మీ ముందుకు వస్తున్నది. ఇంక ఎందుకు ఆలస్యం..!
సంప్రదించవలసిన మొబైల్ నెంబర్స్ :
కె. శ్యామ్
రీజనల్ మేనేజర్,
సెల్: 6304220819
లక్ష్యం గ్రూప్ ఆఫ్ మీడియా
జె.మోహన్
జనరల్ మేనేజర్,
సెల్: 7093410700

ఎడిటర్ ఇన్ చీఫ్-మధుసూదనరావు చల్లా
Cell : 6302222748, 9492569010
Simultaneously circulated in Amaravathi, Hyderabad, Vijayawada, Nellore, Ongole, Guntur, Krishna, Chittoor, Kadapa & all Districts of Andhra Pradesh & Telangana.
సంపుటి:1 సంచిక:273 బుధవారం ,26-11-2025 పేజీలు : 8 వెల: 3/-

LEGAL AFFAIRS
All legal Affairs About Lakshyam Telugu Daily, Should be filled in Guntur Courts Only

### నాలుగేళ్లలో 12.59 లక్షల

# గృహాలు పూర్తి

- ఐదేళ్లలో 15.59 లక్షల గృహ నిర్మాణాల లక్ష్యం.. ఇప్పటికే 3.00 లక్షల ఇళ్లు పూర్తి
- పిఎంఏవై-1.0 పథకంలో నిర్మాణాలు చేపట్టని మరో 3.03 లక్షల గృహాలు కూడా పూర్తి చేస్తాం
- రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలందరికీ 2029 నాటికి శాశ్వత గృహ వసతి
- పిఎంఏవై-2.0 పథకం నెలాఖరుతో ముగుస్తుంది.... అర్హులు సద్వినియోగం చేసుకోవాలి
- రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి

అమరావతి, నవంబరు 25 (లక్ష్యం ప్రత్యేక ప్రతినిధి) : రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలు అందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. ఐదేళ్లలో 15.59 లక్షల గృహ నిర్మాణాలను పూర్తి చేయాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ఉందని, ఇందులో ఇప్పటికే 3.00 లక్షల గృహాలను పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన 12.59 లక్షల గృహాలను వచ్చే నాలుగేళ్లలో పూర్తి చేయడం జరుగుతుంది మంత్రి తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ ఇప్పటికే పూర్తి చేసిన 3.00 లక్షల గృహాలతో పాటు వచ్చే ఉగాదికి 5.00 లక్షల గృహాలను, జూన్ కల్లా మరో 87 వేల గృహాలను పూర్తి చేయాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి గృహ ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పిఎంఏవై-1.00 పథకం అమలు గడువును కేంద్రం మరో ఏడాది పాటు పొడిగించిన నేపథ్యంలో ఈ పథకం క్రింద ఇప్పటి వరకూ ప్రారంభం కాని 3.03 లక్షల గృహాలను కూడా ఈ ఏడాది డిశంబరు కల్లా పూర్తి చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉన్నట్లు ఆయన తెలిపారు.

ఐదేళ్ల కాలంలో దాదాపు 15.59 లక్షల గృహాలను నిర్మించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ఉందని, అయితే వీటిలో పి.ఎం.ఏ.వై.-1.0 క్రింద 8.87 గృహాలు, పిఎంఏవై-2.0 అర్బన్ క్రింద 91 వేల గృహాలు మరియు పిఎంఏవై గ్రామీణ్ క్రింద 5.81 లక్షల గృహాలను నిర్మించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. వీటికి అదనంగా పిఎంఏవై-1.00 పథకం క్రింద ఇప్పటి వరకూ ప్రారంభం కాని 3.03 లక్షల గృహాలను కూడా ఈ ఏడాది డిశంబరు కల్లా పూర్తి చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉన్నట్లు ఆయన తెలిపారు. పిఎంఏవై గ్రామీణ్ క్రింద 5.81 లక్షల గృహాలను నిర్మించాలనే లక్ష్యం పెట్టుకోగా ఇప్పటికే 3.47 లక్షల మంది ఆవాస్ యోజన యాప్ లో ధరఖాస్తు చేసుకోవడం జరిగిందని, ఇంకా ఎవరన్నా అర్హులు ఉంటే ఈ నెలాఖరు లోపు ఈ యాప్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తిచేశారు.

**16 నెలల్లో 3 లక్షల గృహాలను పూర్తి చేశాం**

ఈ గృహ నిర్మాణాలకు సంబందించి ప్రతిపక్ష పార్టీ సభ్యులు వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేయడం ఎంతో దురదృష్టకరమన్నారు. ఐదేళ్ల కాలంలో గత ప్రభుత్వం కేవలం 6.00 లక్షల గృహాలను మాత్రమే పూర్తి చేస్తే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 16 నెలల కాలవ్యవధిలోనే 3.192 లక్షల గృహాలను పూర్తి చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం 18.61 లక్షల గృహాలను మంజూరు చేసి, వాటిలో కేవలం 6.00 లక్షల ఇళ్లను మాత్రమే పూర్తి చేయడం జరిగిందన్నారు. అయితే 2014-19 మద్య కాలంలో తమ ప్రభుత్వ హయాంలో 8.687 లక్షల గృహ నిర్మాణాలను పూర్తి చేయడం జరిగిందన్నారు. 2014-19 మద్య కాలంలో ఎన్.టి.ఆర్.గృహ నిర్మాణ పథకం క్రింద మంజూరు చేసి వివిధ దశల్లో ఉన్న 4.7 లక్షల గృహాలను గత ప్రభుత్వం రద్దు చేయడమే కాకుండా పూర్తయిన 2.7 లక్షల గృహాలకు రూ.920 కోట్లు చెల్లింపు చేయకుండా ఎగ్గొట్టి ఎస్సీ, ఎస్టీ, బి.సి., ఇబిసి వర్గల వారికి అన్యాయం చేయడం జరిగిందన్నారు. అయితే తమ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా పక్షపాత దోరణితో ఏమాత్రం వ్యవహరించకుండా గత ప్రభుత్వం మంజూరు చేసి 18.61 లక్షల గృహాల్లో



మిగిలి ఉన్న 11.90 లక్షల గృహ నిర్మాణాలను కొనసాగించడం జరుగుచున్నదన్నారు. అయితే ఈ ఇళ్లను మేమే ప్రారంభించాము అని గొప్పలు చెప్పుకుంటున్న గత ప్రభుత్వ ప్రతినిధులు వీటి నిర్మాణానికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఇళ్ల నిర్మాణానికై గత ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80 లక్షల్లో రూ.1.50 లక్షలు కేంద్రప్రభుత్వ నిధులు కాగా, మిగిలిన రూ.30 వేలు ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. నిధులు మాత్రమే అన్నారు. అంతేగానీ రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేది ఆయన తెలిపారు.

**81 వేల మందికి ఇళ్ల స్థలాలు**
**1.15 లక్షల మందికి పొజిషన్ సర్టిఫికేట్లు**

ఇళ్ల స్థలాలు కావాల్సిన వారిని గుర్తించేందుకు నిర్వహిస్తున్న సర్వేలో ఇప్పటి వరకు 81 వేల మందికి ఇళ్ల స్థలాలు కావాల్సి ఉందనే విషయాన్ని గుర్తించడం జరిగిందన్నారు. అదే విధంగా దాదాపు 1.15 లక్షల మంది ప్రభుత్వ మరియు పోరంబోకు స్థలాలలో ఉంటున్న వారికి పొజిషన్ సర్టిఫికేట్లను అందజేయాల్సినదిగా ముఖ్యమంత్రి ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో కామన్ వాల్ తో ట్విన్ హౌసెస్ నిర్మించుకునే అవకాశాన్ని కల్పిస్తూ త్వరలో జి.ఓ.ను కూడా జారీ చేయనునట్లు మంత్రి తెలిపారు.

## పూర్వోదయ నిధులతో
## సీమఅభివృద్ధికి ప్రణాళికలు



- ఉద్యాన పంటల సాగు.. మార్కెటింగ్ కోసం మౌలిక సదుపాయాల కల్పన
- రూ.40 వేల కోట్ల వ్యయంతో రాయలసీమ రైతుల అభివృద్ధికి కార్యాచరణ
- 50 లక్షల ఎకరాల్లో ఉద్యాన సాగు లక్ష్యం
- రాయలసీమలో ఉద్యాన పంటల అభివృద్ధిపై సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబర్ 25 (లక్ష్యం ప్రత్యేక ప్రతినిధి) : ప్రపంచంలో డిమాండ్ ఉన్న ఉద్యాన పంటల్లో 18 రకాల పంటలు రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లోనే పండుతాయని...దీన్ని అందిపుచ్చుకునేలా ఉద్యాన పంటలు సాగుచేసే రైతులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పూర్వోదయ నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్వోదయ స్కీంలో భాగంగా రాయలసీమ ఉద్యాన పంటల అభివృద్ధిపై మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాలో 92 క్లస్టర్ల ద్వారా రైతులకు జీవనోపాధి పెంచేలా కార్యాచరణ రూపొందించారు. పూర్వోదయ స్కీమ్‌లో భాగంగా రహదారులు, జలవనరుల ప్రాజెక్టులు, పంచాయతీ రోడ్లు లాంటి పనలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు రూ.40 వేల కోట్లతో ప్రణాళిక అమలు చేయనున్నారు. మొత్తం 5.98 లక్షల ఉద్యాన రైతులకు మరింత లబ్ది కలిగేలా ప్రణాళికపై సమీక్షించారు. అలాగే ప్రపంచ బ్యాంకు నిధులతో రాయలసీమ అభివృద్ధికి ఏయే అంశాల్లో దృష్టి సారించాలనే అంశంపై సీఎం చంద్రబాబు చర్చించారు. నీతి ఆయోగ్ సిఫార్సులతో ఉమ్మడి రాయలసీమ, ప్రకాశం జిల్లాల పరిధిలోని 9 జిల్లాల్లోని హార్టికల్చర్, రహదారులు, ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఆర్ అండ్ బి రోడ్లు, పంచాయతీ రాజ్ రోడ్లు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...'రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దటం లక్ష్యంగా పెట్టుకోవాలి. సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. రాయలసీమలో మొత్తంగా 65 రకాల ఉద్యాన పంటలు పండుతుంటే...

## ప్రభుత్వ హాస్టళ్లల్లో ఆర్వో ప్లాంట్లు తప్పనిసరి

ప్రతి విద్యార్థి బ్లడ్ శాంపిల్స్... హాస్టల్లో వాటర్ శాంపిల్స్ సేకరణ
విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరిగేలా కౌన్సిలింగ్ తరగతులు
సంక్షేమ శాఖలకు ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూం
సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లల్లో పారిశుద్ధ్యం, తాగునీటి వసతిపై సమీక్షలో సీఎం చంద్రబాబు



అమరావతి, నవంబర్ 25 (లక్ష్యం ప్రత్యేక ప్రతినిధి) : ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లల్లో తనిఖీలను మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు మొదలుకుని క్షేత్రస్థాయి సిబ్బంది వరకు తమ విధి నిర్వహణలో భాగంగా చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లు... రెసిడెన్షియల్ స్కూళ్లల్లోని నీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఇతర సదుపాయాలపై మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."సంక్షేమ శాఖ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లల్లో పారిశుద్ధ్యం నూటికి నూరు శాతం నిర్వహించాలి. ఎక్కడా ఏ చిన్న పొరపాటు జరిగినా సహించేది లేదు. ఇటీవల కాలంలో హాస్టళ్లల్లో జరిగిన తప్పిదాలు మళ్లీ రిపీట్ కాకూడదు. అలాంటివి పునరావృతమైతే... ఏం జరిగిందని తెలుసుకునేది ఉండదు... నేరుగా బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. 20 శాతం హాస్టళ్లల్లో టాయిలెట్ల నిర్మాణం ఇంకా జరపాల్సి ఉంది. ఈ టాయిలెట్ల నిర్మాణం కోసం అవసరమైన రూ.40 కోట్లు విడుదల చేస్తాం.

## ఏపీ లాజిస్టిక్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

- ఐదు అంశాలను అనుసంధానించనున్న ఏపీ-లింక్
- ఏపీ-లింక్ ద్వారా లాజిస్టిక్స్ రంగంలో భారీ పెట్టుబడులు రాబట్టాలి : సీఎం చంద్రబాబు

**అమరావతి, నవంబర్ 25 (లక్ష్యం ప్రత్యేక ప్రతినిధి) :** ఏపీ లాజిస్టిక్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మంగళవారం సచివాలయంలో జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేసే హెూల్డింగ్ కంపెనీ తరహాలో ఏపీ-లింక్ వ్యవహరించనుంది. మొత్తంగా ఐదు రంగాలను ఈ కార్పొరేషన్ అనుసంధానించనుంది. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రోడ్లు, అంతర్గత జలరవాణా, గిడ్డంగులు.. వీటిని అనుసంధానిస్తూ లాజిస్టిక్స్ వ్యయం తగ్గించడంతో పాటు... లాజిస్టిక్స్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా ఏపీ లింక్ బాధ్యత తీసుకోనుంది. ఇక రాష్ట్రంలోని లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అమలు, సమన్వయం, పర్యవేక్షణకు ఏపీ లింక్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. ఈ కార్పొరేషనుకు ఓ ఎండీ, వివిధ అనుబంధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, సలహా కమిటీ, క్షేత్రస్థాయిలో ప్రాజెక్టులను అమలు చేయడానికి జిల్లా స్థాయి సెల్స్ ఏర్పాటు చేయనున్నారు. ఈ వివరాలను ఐ అండ్ ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ముఖ్యమంత్రికి వివరించారు. ఏపీ లింక్ ద్వారా లాజిస్టిక్స్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా చూడాలని... అలాగే క్షేత్ర స్థాయిలో వివిధ రంగాలకు అవసరమైన లాజిస్టిక్స్ అందించే విషయంలో సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

## అమరావతిలో నేడు విద్యార్థుల మాక్ అసెంబ్లీ




## ఆప్కోలో సంక్రాంతి వరకూ
# డిస్కౌంట్ సంబరాలు



- 40 శాతం డిస్కౌంట్ కు చేనేత అమ్మకాలు
- డిస్కౌంట్ అమ్మకాలతో పెరిగిన రోజువారీ విక్రయాలు
- రూ.3 లక్షల నుంచి రూ.9 లక్షలకు పెరిగిన అమ్మకాలు
- త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా చేనేత బజార్లు : రాష్ట్ర మంత్రి సవిత

**అమరావతి, నవంబర్ 25 (లక్ష్యం ప్రత్యేక ప్రతినిధి) :** రాష్ట్ర ప్రజలకు ఆప్కో చేనేత వస్త్రాల విక్రయకేంద్రం మరోసారి ప్రజలకు శుభవార్త తెలిపింది. వినియోగదారుల రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని వచ్చే సంక్రాంతి వరకూ ఆప్కో షో రూమ్ ల ద్వారా 40 శాతం డిస్కౌంట్ కు చేనేత వస్త్రాలు విక్రయించనున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఆమె సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. మారుతున్న అభిరుచుల దృష్ట్యా ప్రజల్లోనూ చేనేత వస్త్రాల వినియోగంపై మక్కువ పెరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో దసరా, దీపావళి పండుగలను దృష్టిలో పెట్టుకుని ఆప్కో షో రూమ్ ల్లో చేనేత వస్త్రాలను 40 శాతం డిస్కౌంట్ పై విక్రయించిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. ప్రజలు, వినియోగదారుల నుంచి వచ్చిన స్పందన నేపథ్యంలో డిస్కౌంట్ అమ్మకాలు వచ్చే సంక్రాంతి వరకూ కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. డిస్కౌంట్ లో అమ్మకాలతో అటు ప్రజలకు చేనేత వస్త్రాలను మరింత చేరువ చేసే అవకాశం కలుతోందన్నారు. అదే సమయంలో చేనేత వస్త్రాల విక్రయాల పెరుగుదలతో నేతన్నలకు ఆర్థిక భరోసాతో కూడిన ఉపాధి లభిస్తోందని తెలిపారు.

**రూ.9 లక్షలకు పెరిగిన అమ్మకాలు**

40 శాతం డిస్కౌంట్ కు ఆప్కో షో రూమ్ ల ద్వారా చేనేత వస్త్రాలను విక్రయించడం వల్ల అమ్మకాలు సైతం పెరిగినట్లు మంత్రి సవిత వెల్లడించారు. డిస్కౌంట్ ఇవ్వడానికి ముందు రాష్ట్ర వ్యాప్తంగా ఆప్కో షో రూమ్ ల ద్వారా రోజుకు సరాసరి రూ.3 లక్షల చొప్పున విక్రయాలు జరిగేవన్నారు.

## లింగ వివక్షత పై విస్తృత ప్రచారం కల్పించాలి

- పురుషులతో సమానంగా మహిళాభివృద్ధే లక్ష్యం
-గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ సీఈవో వాకాటి కరుణ

విజయవాడ, నవంబర్ 25 (లక్ష్యం ప్రత్యేక ప్రతినిధి) : లింగ ఆధారిత వివక్షపై పోరాటం, స్త్రీ, పురుష సమానత్వం ఆవశ్యకతపై పౌరుల్లో అవగాహన పెంచడం నయీ చేతన జాతీయ జెండర్ క్యాంపైన్ ను 4.0 ముఖ్య ఉద్దేశ్యం అని గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ సీఈవో వాకాటి కరుణ తెలిపారు. మంగళవారం సెర్ప్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ సీఈవో వాకాటి కరుణ మాట్లాడుతూ... కుటుంబం, సమాజం లో మహిళలు పోషించే పాత్ర అద్వితీయమైనదని నేడు అన్ని రంగాల్లో మహిళలు ప్రగతి పథం లో




కొనసాగుతున్నారన్నారు. అయినా కొన్ని సందర్భాల్లో మహిళల పట్ల వివక్ష కొనసాగుతోందని, ఈ వివక్షను తగ్గించడం లేదా పూర్తిగా రూపు మాపటానికి సమాజం లోని ప్రతి ఒక్కరూ ముఖ్యంగా పురుషులు ముందుకు రావాలని

## జాతీయ స్థాయిలో రాష్ట్రం పేరు ఇనుమడించేలా ఉద్భవ్-2025.

- ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల 6వ జాతీయ సాంస్కృతిక ఉత్సవాలకు ఏపీ వేదిక
- కెఎల్ యూనివర్సిటీ ప్రాంగణంలో డిసెంబర్ 3 నుండి 3 రోజుల పాటు ఉద్భవ్-2025
- 22 రాష్ట్రాల నుండి 1800 మంది విద్యార్థులు హాజరు

రాష్ట్ర మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి

**అమరావతి, నవంబర్ 25 (లక్ష్యం ప్రత్యేక ప్రతినిధి) :**

జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పేరు ఇనుమడించేలా ఉద్భవ్-2025 నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశామని మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియాల్ పాఠశాలల ఆధ్వర్యంలో డిసెంబర్ 3 నుండి 3 రోజుల పాటు నిర్వహించే 6 వ జాతీయ సాంస్కృతిక ఉత్సవాలను పండగ వాతావరణంలో నిర్వహించనున్నామని మంత్రి సంధ్యారాణి చెప్పారు. ఏపీ సచివాలయం 3వ బ్లాక్ లోని మంత్రి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల్లో



దాగిఉన్న ప్రతిభను వెలికితీయడం, వారిలో జాతీయ సమైఖ్యతను ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 3,4,5 తేదీల్లో కెఎల్ యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించడానికి సమాయత్తమవుతున్నామని వివరించారు. ఈ ఉత్సవాలను ఉద్భవ్-2025 పేరుతో నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవ్ 2025కు దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాలకు చెందిన 405 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ నుండి 1800 మంది విద్యార్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. మన రాష్ట్రం నుండి 110 మంది విద్యార్థులు ఈ వేడుకలకు హాజరుకానున్నారు. విద్యార్థులతో పాటు ఆయా రాష్ట్రాల నుండి ఉన్నతాధికారులు,

## నాలుగేళ్లలో 12.59 లక్షల

# గృహాలు పూర్తి

(మొదటిపేజీ తరువాయి )

ఎస్సీ,ఎస్టీ,బిసి., పివిటిజిల గృహ నిర్మాణాలకు తమ ప్రభుత్వం అదనంగా ఇచ్చే ఆర్థిక సహాయాన్ని గత ప్రభుత్వం నిలిపివేసిందని, అయితే తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ అదనపు ఆర్థిక సహాయాన్ని పునరుద్ధరిస్తూ దాదాపు రూ.3,200 కోట్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. మైనారిటీలకు కూడా అదనంగా రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసేందుకు ఈ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు.

**రూ.80 కోట్ల మేర అవినీతికి పాల్పడిన రాక్రీట్ నిర్మాణ సంస్థ**

గృహ నిర్మాణాల విషయంలో గతంలో జరిగిన అవకతవకలపై విజిలెన్సు నివేదిక అందజేయడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ నివేదిక ప్రకారం రాక్రీట్ నిర్మాణ సంస్థ గృహ నిర్మాణాల విషయంలో పలు అవకతవలకు పాల్పడినట్లు వెల్లడైందన్నారు. ఈ సంస్థకు 50,402 ఇళ్ల నిర్మాణ పనులను అప్పగించడం జరిగిందని, అయితే వీటిలో 47,850 గృహ నిర్మాణాలను ప్రారంభించి అసంపూర్తిగా వదిలేసి గృహ లబ్దిదారులను తీవ్ర అన్యాయానికి గురిచేయడం జరిగిందన్నారు. దాదాపు రూ.80 కోట్ల మేర అవినీతికి ఈ సంస్థ పాల్పడినట్లు వెల్లడైందని, ఈ సొమ్మును ఆ సంస్థ నుండి రికవరీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు మరియు ఏ ఏ జిల్లాల్లో అవకతవలకు పాల్పడటం జరిగిందో ఆయా జిల్లాల్లో లీగల్ గా అవకాశం అన్ని రకాల కేసులను నమోదు చేయాలని ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

# పూర్వోదయ నిధులతో

## సీమఅభివృద్ధికి ప్రణాళికలు

(మొదటిపేజీ తరువాయి )

డిమాండ్ డ్రివెన్ హార్టికల్చర్ 18 రకాల పంటలకు మంచి డిమాండ్ ఉంది. ఈ రకాల పంటలను పండించేలా ఉద్యాన రైతులను ప్రోత్సహించాలి. అప్పుడు సీమలో ఉద్యాన పంటల ద్వారా ఆదాయాన్ని పెంచుకోవడం సులువుగా ఉంటుంది. దీనికోసం రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలి. రెగ్యులర్ క్రాప్స్ కంటే... భవిష్యత్తులో ప్రజల అలవాట్లకు అనుగుణంగా పంటలు పండించాల్సి ఉంటుంది. అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో ఉత్పత్తి, టేబుల్ వెరైటీలను పండించి ఆ పంటలకు విలువ జోడించాలి. అప్పుడే రైతులకు ఆర్థిక ప్రయోజనాలు అందుతాయి. మైక్రో ఇరిగేషన్ ద్వారా ఈ ఉద్యాన పంటలకు నీటిని అందించాలి. హార్టికల్చర్ జోన్లుగా తీర్చిదిద్ది ప్రోత్సాహకాలు కల్పించాలి. ఆర్గానిక్ సేద్యం ద్వారా ఉద్యాన పంటలు పండించాలి. ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఉద్యాన పంటలు పండిస్తే అది రైతులకు మేలు కలుగుతుంది. ఆక్వా రంగం తరహాలోనే ఉద్యాన రంగం కూడా భవిష్యత్తులో అగ్రస్థానానికి చేరుతుంది. ఈ 9 జిల్లాల పరిధిలో ప్రస్తుతమున్న 10 రకాల ఉద్యాన పంటలతో పాటు...డిమాండ్ ఉన్న మరో 8 పంటలను కూడా పండించేలా చర్యలు తీసుకోండి” అని ముఖ్యమంత్రి ఆదేశించారు.అంతర్జాతీయ మార్కెట్‌కు సీమ ఉత్పత్తులు‘50 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటల ద్వారా పెద్ద ఎత్తున రైతులకు ప్రయోజనం కలుగుతుంది. 18 ముఖ్యమైన పంటలను లక్ష్యంగా చేసుకుని వాటికి మంచి సాగు సదుపాయాలు కల్పించటం, రవాణా, లాజిస్టిక్స్, మార్కెటింగ్, కోల్డ్ చైన్‌లాంటి మౌలిక సదుపాయాలు కల్పించాలి. దుబాయ్ లాంటి ప్రాంతాలకు ఎయిర్ కార్గో ద్వారా రవాణా చేయగలగాలి. దుబాయ్ నుంచి ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు పండ్లను రవాణా చేసే అవకాశం ఉంటుంది. స్పెషల్ కార్గోగా ఈ పండ్లను అంతర్జాతీయ మార్కెట్లకు తరలిస్తే రైతులు, ఈ ప్రాంత భవిష్యత్ మారిపోతుంది. రాయలసీమ ప్రాంతంలో ఇంకా కవర్ కానీ గ్యాప్స్‌ను గుర్తించి అక్కడకూ నీటి సరఫరా కోసం ఎంత వ్యయం అవుతుందో అంచనా వేయండి. రాయలసీమకు మంచి రహదారులు వచ్చాయి. మారుమూల ప్రాంతాలను కలుపుతూ మరికొన్ని రహదారులు రావాల్సి ఉంది. తద్వారా మార్కెటింగ్ మెరుగుపడుతుంది. ఉద్యాన పంటల సాగు మొదలుకుని మార్కెటింగ్ వరకు వివిధ ప్రాజెక్టులను చేపడుతున్నాం. ఈ మేరకు మొత్తంగా రూ.14,800 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఖర్చు పెట్టబోతున్నాం. ఇందులో సబ్సిడీ రూపంలో రూ.9,000 కోట్లు ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. ఈ విషయం రైతులకు అర్థమయ్యేలా చెప్పాలి. అరటి, చినీ, బొప్పాయి, దానిమ్మ, మామిడి, ఉల్లి, టమోటా, మిరప, నిమ్మ లాంటి వివిధ ఉద్యాన పంటలపై ఫోకస్ పెట్టాలి”అని సీఎం వివరించారు. ఈ సమీక్షలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల భూగర్భ జలాలు రాయలసీమలో మెరుగ్గా ఉన్నాయనే ప్రస్తావన వచ్చింది. హంద్రీ-నీవా సహా వివిధ ప్రాజెక్టుల ద్వారా నీటిని సరఫరా చేస్తుండడం వల్ల సీమలో ఉద్యాన సాగు గతంతో పోల్చుకుంటే సులభతరం అయిందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అభిప్రాయపడ్డారు. పంటలు చక్కగా పండడం వల్ల ఓవైపు రైతులకు ఆదాయం రావడంతోపాటు... భూముల రేట్లు పెరిగాయని దానికి తమ ప్రాంతమైన ఉమ్మడి అనంతపుర జిల్లానే ప్రత్యక్ష ఉదాహరణ అని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక, వ్యవసాయ, హార్టీకల్చర్, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆప్కోలో సంక్రాంతి వరకూ డిస్కౌంట్ సంబరాలు

(మొదటిపేజీ తరువాయి )

40 శాతం డిస్కౌంట్ తో అమ్మకాలు ప్రారంభించిన తరవాత రోజువారీ అమ్మకాలు రూ.9 లక్షలకు పెరిగినట్లు మంత్రి సవిత తెలిపారు. డిస్కౌంట్ విక్రయాలతో పాటు చేనేత వస్త్రాల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారన్నారు. ప్రస్తుత ట్రెండ్ ను దృష్టిలో పెట్టుకుని చిన్నారులతో పాటు ఆయా వయస్సుల వారికి అవసరమైన రెడీ మేడ్ చేనేత వస్త్రాలను ఆప్కో షో రూమ్ ల్లో విక్రయిస్తున్నామన్నారు. దీంతో చేనేత వస్త్రాల కొనుగోలు పెరిగినట్లు మంత్రి సవిత తెలిపారు.

**రాష్ట్ర వ్యాప్తంగా చేనేత బజార్లు**

చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అన్ని ప్రణాళికలు రూపొందిస్తోందని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో చేనేత బజార్లు, ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే విజయవాడ, గుంటూరు, రాజమండ్రిలో చేనేత ఎగ్జిబిషన్లు నిర్వహించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. త్వరలో విశాఖ, కర్నూలు, కడప వంటి నగరాలతో పాటు ఇతర జిల్లా కేంద్రాల్లోనూ చేనేత ఎగ్జిబిషన్లు, బజార్లు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి సవిత ఆ ప్రకటనలో తెలిపారు.

## అమరావతిలో నేడు విద్యార్థుల మాక్ అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి )



- సభాపతి... ముఖ్యమంత్రి.. ప్రతిపక్ష నేతగా.. మంత్రుల పాత్రలో ప్రభుత్వ బదుల విద్యార్థులు
- రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల నుండి విద్యార్థినీ విద్యార్థుల ఎంపిక

అమరావతి, నవంబర్ 25 (లక్ష్యం ప్రత్యేక ప్రతినిధి) : భారత రాజ్యాంగ దినోత్సవం %-% 2025 ను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో “పాఠశాల విద్యార్థులచే శాసనసభ నమూనా సమావేశం బుధవారం ఉదయం 9.00 గంటలకు అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రాంగణంలో నిర్వహించనున్నారు. పాఠశాల విద్యార్థుల్లో రాజ్యాంగ పట్ల గౌరవం, భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, శాసనసభా ప్రక్రియలు మరియు ప్రజా ప్రతినిధుల పాత్రలపై అవగాహన కల్పించడంతో పాటు నాయకత్వ లక్షణాలను, నైపుణ్యాలను పెంపొందించడమే ముఖ్య లక్ష్యం ఈ “మాక్ డ్రిల్ అసెంబ్లీ” నిర్వహిస్తున్నారు. రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ %డ% కమ్యూనికేషన్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు సమాచార శాఖ సహాయ మంత్రివర్యులు డా. పెమ్మసాని చంద్రశేఖర్, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా, పర్యావరణం, అటవీ శాఖ మరియు సైన్స్ %డ% టెక్నాలజీ శాఖల మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక %డ% సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, గుంటూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కందుల దుర్గేష్ విశిష్ట అతిథులుగా హాజరుకానున్నారు. రాష్ట్ర మంత్రులతో పాటు విద్యార్థుల నీతి.. విలువలు సలహాదారులు చాగంటి కోటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్, శ్రీమతి మయాన జకీయా ఖానమ్, ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, చీఫ్ విప్‌లు %డ% విప్‌లు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు, మేయర్లు, పార్లమెంట్ సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, కార్పొరేషన్ చైర్‌పర్సన్లు, గ్రంథాలయ సంస్థ %డ% ఇతర ప్రజా ప్రతినిధులు గౌరవ అతిథులు గా ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు. వీరితోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర, పాఠశాల విద్య, ఉన్నత విద్య మరియు నైపుణ్యాభివృద్ధి శాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ శ్రీ విజయ్ రామ రాజు వి, గుంటూరు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్ శ్రీమతి ఎ. తమీమ్ అన్సారియా, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు ప్రత్యేక అతిథులుగా ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు.

## ప్రభుత్వ హాస్టళ్లల్లో

# ఆర్వో ప్లాంట్లు తప్పనిసరి

(మొదటిపేజీ తరువాయి )

టాయిలెట్ల నిర్మాణం యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి. ఆర్వో ప్లాంట్లు, టాయిలెట్లు లేకుండా హాస్టళ్లు ఉండడం సరి కాదు. గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం వల్ల ఇవన్నీ జరిగాయి. ఆర్వో ప్లాంట్లు లేని ప్రతి హాస్టల్లోనూ... ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలల్లోనూ ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయాలి. డాక్టర్లతో విద్యార్థులకు రెగ్యులర్ హెల్త్ చెకప్స్ చేయించాలి. హాస్టళ్లలోని 4.17 లక్షల మంది విద్యార్థుల రక్త నమూనాలు సేకరించి సమస్యలు ఉన్నవారిని ముందుగానే గుర్తించి చికిత్సలు అందించాలి. బడుగు విద్యార్థులకు చేసే సాయాన్ని బాధ్యతగా తీసుకోవాలి. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో హాస్టళ్లు పెట్టారు. దీనికి విఘాతం కల్గించేలా అలక్ష్యం చేస్తే ఊరుకునేదే లేదు. హాస్టళ్లల్లో పరిస్థితి పరిశీలించేందుకు క్షేత్రస్థాయి పర్యటనల చేపట్టడంతో పాటు...పరిస్థితులపై నిత్యం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించుకోవాలి.

**ప్రతి వారం ఆర్వో ప్లాంట్ల ఆడిటింగ్**

“సంక్షేమ రంగానికి చెందిన శాఖలన్నీ కలిపి ఉమ్మడిగా ఓ కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకోవాలి. అన్ని హాస్టళ్లల్లోని విద్యార్థులకు డిజిటల్ హెల్త్ రికార్డ్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. వైద్య పరీక్షలు నిర్వహించే సందర్భంగా విద్యార్థుల్లో ఏమైనా ఆరోగ్య సమస్యలు గుర్తిస్తే... ఆ అనారోగ్య సమస్యలకు గల మూలాలను విశ్లేషించాలి. దానికి అనుగుణంగా వైద్యం అందేలా చూడాలి. ఏజెన్సీ ప్రాంతాల్లోని హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరిగేలా ప్రత్యేక కౌన్సిలర్లతో కౌన్సిలింగ్ ఇప్పించండి. బాలుర హాస్టళ్లల్లోని వారికి మగ కౌన్సిలర్ల ద్వారా... బాలికల హాస్టళ్లోని వారికి మహిళా కౌన్సిలర్లతో కౌన్సిలింగ్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకునే ఆత్మస్థైర్యంతో నిలబడగలిగేలా విద్యార్థులను తీర్చి దిద్దాలి. హాస్టళ్లల్లో నీటి సరఫరా విషయంలో పంచాయతీరాజ్, హెల్త్, మున్సిపల్ శాఖలు, సంక్షేమ, వైద్యారోగ్య శాఖలు కలిసి పని చేయాలి. అన్ని హాస్టళ్లల్లో వాటర్ శాంపిల్స్ కూడా తీసుకోవాలి. ఎనిమియా, సికెల్ సెల్ వ్యాధులపై అవగాహన కల్పించే బాధ్యతను అధికారులపైనే ఉంది.”అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, గుమ్మడి సంధ్యారాణి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పంచాయతీ రాజ్, వైద్యారోగ్య శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# స్టెమీతో 95.94 శాతం మందికి తప్పిన ప్రాణగండం

- ‘గోల్డెన్ అవర్’ లో ఉచితంగా ‘టెనెక్టెప్లేస్ ఇంజెక్షన్’ తో గుండెకు రక్షణ
- ప్రైవేట్ లో ఇంజెక్షన్ ధర రూ.40 నుండి 45 వేలు.. ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితం
- అనంతపురం, విశాఖపట్నం, కర్నూలు జిల్లాల్లో అత్యధిక వినియోగం
- వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**అమరావతి, నవంబర్ 25 (లక్ష్యం ప్రత్యేక ప్రతినిధి) :** గ్రామీణ ప్రాంతాల్లో అకస్మాత్తుగా గుండె నొప్పి వచ్చిన వారికి ‘అత్యవసర వైద్యం’ (గోల్డెన్ అవర్) కింద స్టెమీ విధానంలో ఇస్తున్న చికిత్సవల్ల గతేడాది జూన్ 1 నుంచి ఈ నెల 15 వరకు 3,027 మంది ప్రాణాలు నిలిచాయని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. రాష్ట్రంలో 238 ప్రభుత్వ సామాజిక, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రుల్లో ప్రవేశపెట్టిన ‘స్టెమీస (ఎస్.టీ - సెగ్మెంట్ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్) విధానం కింద ఖరీదైన ‘టెనెక్టెప్లస్’ ఇంజెక్షన్ ఉచితంగా ఇవ్వడం ద్వారా విలువైన ప్రాణాలు నిలబడుతున్నాయని తెలిపారు. ఛాతీనొప్పి లక్షణాలతో ఆసుపత్రులకు వచ్చిన వారిలో ‘టెనెక్టె ప్లేస్’ ఇంజక్షన్ అవసరమని గుర్తించిన 3,155 మందిలో 3,027 (95.94%) మంది ప్రాణాలు నిలబడినట్లు పేర్కొన్నారు. వీరితోపాటు ఇంజెక్షన్ పొందిన మిగిలిన వారి ఆరోగ్య పరిస్థితి అప్పటికే విషమించి ఉండడం, సమయం మించిపోవడం వంటి కారణాలతో ప్రాణాలు విడిచారని పేర్కొన్నారు. ఈ సంఖ్యను ఇంకా తగ్గించేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్సీడీ-4.0 సర్వేలో భాగంగా స్టెమీ విధానం అమలుపై ఆశా వర్కర్లు, ఎ.ఎన్.ఎం.ల ద్వారా ఛాతీనొప్పి లక్షణాలు ఎలా గుర్తించాలన్న దానిపై శిక్షణ ఇవ్వబోతున్నామని మంత్రి సత్యకుమార్ కు ఉన్నతాధికారులు నివేదించారు.

**ఆసుపత్రుల్లో సౌకర్యాలు, పరికరాల కోసం రూ.16.60 కోట్లు వ్యయం**

స్టెమీ విధానాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు 238 ఆసుపత్రుల్లో అవసరమైన పరికరాలు, యంత్రాల కోసం కలిపి రూ.16.60 కోట్లు ఖర్చుపెట్టారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇంజక్షన్ ధర రూ. 40 నుండి 45 వేల వరకు ఉంది. ఇతర ఖర్చులు అదనం. ప్రభుత్వం టెండర్ ద్వారా వీటిని కొనుగోలు చేస్తోంది. ఒక్కొక్క ఇంజెక్షన్ కు రూ.19,000 తోపాటు అదనంగా ఇతర మందుల కోసం రూ. 6,000 ఖర్చుపెడుతోంది. దీని ప్రకారం ఇప్పటివరకు లబ్ధిపొందిన 3,155 మందికి కలిపి రూ.7.88 కోట్ల వరకు ప్రభుత్వం వ్యయం చేసింది.

**సిద్ధంగా ఇంజెక్షన్లు**

ప్రతి సీహెచ్సీలో 3, ఏరియా ఆసుపత్రిలో 4, జిల్లా ఆసుపత్రిలో 5 చొప్పున ఈ ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచుతున్నారు. అవసరాలకు అనుగుణంగా అదనంగా అవసరమైతే తక్షణమే పొందే విధంగా ఇంజెక్షన్లు జిల్లా మందుల గిడ్డంగుల్లో సిద్ధం ఉంచుతున్నారు .

**సగటున 175 మందికి**

స్టెమీ చికిత్స కింద ప్రతి నెలా సగటున 175 మంది ప్రభుత్వాసుపత్రుల్లో టెనెక్ట్ ప్లేస్ ఇంజెక్షన్ పొందుతున్నారు. ఈ ఏడాది ఆగస్టులో 201, సెప్టెంబరులో 217, అక్టోబరులో 186 మంది చొప్పున ఇంజక్షన్ పొందారు. ఈనెల 15వ తేదీ వరకు 99 మందికి ఇంజెక్షన్ ఇచ్చినట్లు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధర్ బాబు వెల్లడించారు.

**జిల్లాల వారీగా....**

గత ఏడాది జూన్ 1 నుంచి ఈనెల 15వ తేదీ వరకు రాష్ట్రంలోనే అత్యధికంగా అనంతపురం జిల్లాలో 617 మందికి స్టెమీ చికిత్స లభించింది. గుంతకల్లు ఏరియా ఆసుపత్రిలో ఈ సంఖ్య 124 వరకు ఉంది. దూర ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడి ఆసుపత్రికి వచ్చి అత్యవసర వైద్యం పొంది, ప్రాణాలు దక్కించుకున్నారు. విశాఖ జిల్లాలో 416, కర్నూలు-412, గుంటూరు-354, కాకినాడ-346, తిరుపతి-213, ఎన్టీఆర్-205, శ్రీకాకుళం-203, కడప-147, ఒంగోలు-134, నెల్లూరు జిల్లాల్లో 108 మందికి చొప్పున ‘స్టెమీ’ వైద్యం అందించినట్లు డీయస్ హెచ్ చక్రధర్ బాబు మంత్రి కి వివరించారు ..

**ఫాలోఅప్ కూడా..**

స్టెమీ విధానంలో చికిత్స పొందిన వారి గురించి 108 కాల్ సెంటర్ ద్వారా వారి ఆరోగ్య వివరాలను వాకబు చేస్తున్నారు. వీరి వివరాలను ఇకపై ఏ ఎన్. ఎం.లు, సచివాలయాలకు



పంపుబోతున్నామని అధికారులు మంత్రికి తెలిపారు .

**రక్తం గడ్డను కరిగించినందున..**

రక్త ప్రసరణ తగ్గి.... గుండె పోటుకు గురైన వారికి తక్షణ వైద్యం కింద స్టెమీ విధానంలో చికిత్స అందిస్తున్నారు. స్టెమీ చికిత్సలో భాగంగా టెనెక్ట్ ప్లేస్ ఇంజెక్షన్ ద్వారా గడ్డకట్టిన రక్తాన్ని కరిగిస్తున్నారు. దీనివల్ల గుండెకు రక్త ప్రసరణ యథావిధిగా జరగడమే కాకుండా సకాలంలో పెద్దాసుపత్రుల్లో ఉన్నత వైద్యాన్ని పొందడంవల్ల బాధితులు ప్రాణాపాయ పరిస్థితుల నుంచి బయటపడుతున్నారు.

**‘యాప్’ ద్వారా కార్డియాలజిస్టులకు వివరాలు**

డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలోని సామాజిక, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రు (238)ల్లో స్టెమీ విధానం అమల్లో ఉంది. ఈ ఆసుపత్రులకు గుండెనొప్పితో బాధపడుతూ వచ్చిన వారి ఆరోగ్య వివరాలను అక్కడి వైద్య సిబ్బంది తమ పరిధిలోని బోధనాసుపత్రుల్లోని కార్డియాలజీ విభాగానికి ‘స్టెమీ’ యాప్ ద్వారా (ఈసీజీ, ఇతర సమాచారాన్ని) పంపుతున్నారు. అక్కడి నిపుణులు వాటిని పరిశీలించి, ఇంజెక్షన్ ఇవ్వాలా? వద్దా? ఇంజెక్షన్ ఇస్తే తదుపరి చికిత్స ఎలా? ఏమీ చేయాలన్న దానిపై విలువైన సలహాలు, సూచనలు వైద్య సిబ్బందికి ఇస్తున్నారు. ఇంజెక్షన్ పొందిన అనంతరం రోగులు బోధనాసుత్రులు లేదా డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ పరిధిలోని, ప్రైవేట్ అనుబంధ ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొందుతున్నారు.

## జాతీయ పాల దినోత్సవం - పాల ద్వారానే సంపూర్ణ పోషణ సాధ్యం

### రాష్ట్ర పశు సంవర్ధక శాఖ, సంచాలకులు డా. టి. దామోదర్ నాయుడు








అమరావతి, నవంబర్ 25 (లక్ష్యం ప్రత్యేక ప్రతినిధి) :

పాలు, పాల ఉత్పత్తుల ద్వారానే సంపూర్ణ పోషణ సాధ్యమని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ సంచాలకులు డాక్టర్ టి.దామోదర్ నాయుడు వ్యాఖ్యానించారు. జాతీయ పాల దినోత్సవం సందర్భంగా ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర పశు సంవర్ధక శాఖ పశుపోషకుల ప్రయోజనార్ధం, అధిక పశూత్పత్తులను పొందడానికి రైతు సేవా కేంద్రాల ద్వారా పశుపోషకుని ఇంటివద్దే పశు వైద్యం చేయించే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా నిర్వహిస్తోందని ఆయన వెల్లడించారు. అలాగే పశుగ్రాస భద్రతా విధానం, దాణా మరియు పశుగ్రాస అభివృద్ధి కార్యక్రమాలు, జన్యు పరంగా అత్యుత్తమ నిర్మాణం గల పశుజాతుల అభివృద్ధి, ఉచిత పశు ఆరోగ్య శిబిరాల నిర్వహణకుర సంబంధించిన అనేక అంశాలలో పశుసవర్ధకశాఖ నియమించిన పశువైద్యులు నేరుగా వారి ఇళ్లకే వచ్చి.. వారి పశుసంపదకు తగిన వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. పశువులకు తరచుగా సంభ వించే గర్భకోస వ్యాధుల చికిత్సా శిబిరాలు, లింగ నిర్ధారిత వీర్య నాళికలు పంపిణీ, పశు బీమా, సంచార పశు ఆరోగ్య సేవా వాహనాలు, గోకులాలు, పశు కిసాన్ క్రెడిట్ కార్డ్స్ వంటి పథకాలు అమలు చేస్తూ మేలు రకపు పశుగణాన్ని వృద్ధి చేయడమే కాకుండా అధిక పశూత్పత్తులను ఉత్పత్తి చేయడం జరుగుతోందని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ, సంచాలకులు డా. టి. దామోదర్ నాయుడు తెలిపారు. ఎ ా డ ి పంటలు గ్రామీణ జన జీవనంలో గౌరవానికి, హోదాకు చిహ్నంగా భావించడం జరుగుతుంది. మానవ నాగరికత పరిణామ క్రమంలో పశువుల పెంపకం, పాడి చేయడం ప్రముఖ పాత్ర వహించాయి. పాలు అనేది మన వ్యవసాయ రంగంలోనే అతిపెద్ద ఆదాయ వనరు. ఇది జాతీయ ఆర్థిక వ్యవస్థకు 5 శాతం వరకు తోడ్పాటును అందించడంతో పాటు, దేశంలో 8 కోట్లు పైగా రైతులకు నేరుగా ఉపాధి అందించడం జరుగుతోంది. మన దేశం ప్రపంచంలోనే అత్యధిక పశువులను కలిగి అధిక పాలు ఉత్పత్తి చేసే దేశం. మొత్తం ప్రపంచ పాల ఉత్పత్తిలో 24.64% మన దేశం నుండే ఉత్పత్తి జరుగుతోంది. గత తొమ్మిది సంవత్సరాలలో దేశంలోని పాల ఉత్పత్తి 58% మేర పెరుగుదలను నమోదు చేయడం జరిగిందన్నారు. పాలను, పాడి పరిశ్రమ విశిష్టతను పరిగణలోకి తీసుకొని పశుపోషకులకు మరింత అవగాహన కల్పించడానికి, పాల లభ్యతను పెంచడానికి, పాడి పరిశ్రమను మరింత ప్రోత్సహించడానికి, క్షీర విప్లవ పిత డా. కురియన్ గారి జన్మదినమైన నవంబర్ 26వ తేదీన భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం జాతీయ పాల దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతోందని వివరించారు. దేశంలో మన రాష్ట్రం 139.46 లక్షల మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తితో 7వ స్థానంలో ఉంది, మన రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది రైతులు పశుపోషణపై ఆధారపడి జీవనోపాదిని పొందుతున్నారని, మన రాష్ట్రంలో ప్రస్తుత పాలు, పాల ఉత్పత్తుల విలువ ?713.9 బిలియన్ ఉండగా, దీనిని 2033 నాటికి రెండింతలు పెంచేందుకు వివిధ వినూత్నమైన రాయితీ పథకాలను అమలుచేయడం జరుగుతోంది. 21వ అఖిల భారత పశుగణ పశుగణన (2025) ప్రకారం మన రాష్ట్రంలో 46 లక్షల ఆవు జాతి పశువులు ( దేశంలో 14వ స్థానం) మరియు 62.19 లక్షల గేదె జాతి పశువులు (దేశంలో 6 వ స్థానం) ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మన రాష్ట్ర పాల ఉత్పత్తి 139.46 లక్షల టన్నులగా ఉంది. 2033 సంవత్సరనాటికి పాల ఉత్పత్తిని 150 లక్షల టన్నులు సాధించి, 15% వృద్ధిరేటుతో దేశంలోనే మొదటి మూడు స్థానాలలో ఉండాలని లక్ష్యంగా నిర్దేశించుకోవడం జరిగింది. మన రాష్ట్రంలో ఒక్కొక్క వ్యక్తి సగటు పాల వినియోగం రోజుకు సుమారు 719 గ్రాములుగా ఉంది. ఇది దేశ సగటు రోజువారీ పాల వినియోగం సుమారు 459 గ్రాముల కంటే చాలా ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేశారు.

# జాతీయ స్థాయిలో రాష్ట్రం పేరు ఇనుమడించేలా ఉద్భవ్-2025.

(మొదటిపేజీ తరువాయి )

ఉపాధ్యాయులు, సంరక్షకులు, కంటింజెంట్ మేనేజర్స్ హాజరవుతారన్నారు.

వేడుకల్లో కల్చరల్ యాక్టివిటీస్ తో పాటు ఆటపాటలు, గిరిజన ముఖచిత్రం ప్రతిబింబించేలా ఆర్ట్స్, లిటరేచర్ ప్రదర్శనలు ఉంటాయని మంత్రి సంధ్యారాణి తెలిపారు. ఇందుకోసం కెఎల్ యూనివర్సిటీలో 12 వేదికలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపర్చి జాతీయ పోటీలైన ఉద్భవ్2025కు ఎంపికైన విద్యర్థులందరూ ఒకే వేదికగా కలవబోతున్నారన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్ లు అందచేస్తామన్నారు. ఉద్భవ్ 2025 ఉత్సవాలకు 6 వ తరగతి నుండి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు హాజరకానున్నారన్నారు. గురుకులాల విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికితీయడంతో పాటు వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపోందించే ఇలాంటి జాతీయ స్థాయి సమ్మెళనాలు మరెన్నో జరగాలన్నారు. 6వ జాతీయ ఉత్సవాలను మన రాష్ట్రంలో నిర్వహించడం మన అదృష్టమన్నారు. ఈ ఉత్సవాలు విద్యార్థుల్లో పర్యాటక అనుభూతిని కలిగించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల (ఈఎంఆర్ఎస్ )విద్యార్థులు నీట్, ఐఐటీ, ఎన్ఐటీలలో ఎక్కువ మంది ఎంపికవుతున్నారని, అలాగే విదేశీ విద్యకు ఎక్కువ మంది ఎంపికయ్యేలా ఇప్పటి నుండే చర్యలు తీసుకుంటున్నామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గిరిజన విద్యార్థులను చురుకుగా తయారు చేయడమే మా లక్ష్యమన్నారు. ఇటువంటి జాతీయ స్థాయి ఉత్సవాలు ఇతర రాష్ట్రాల ఆహార అలవాట్లు, సంస్కృతి, భాషల వైవిధ్యంపై అవగాహన పెంచుతాయన్నారు. జాతీయ స్థాయిలో మన విద్యార్థులు ఎందులోనూ తక్కువ కాదని నిరూపిస్తున్నారని, వారిలోని ఉత్సాహానికి ఇటువంటి వేదికలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో డోలీ మోతలకు చెక్ పెట్టేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, దశల వారీగా రహదారుల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఇప్పటి వరకు రూ. 1300 కోట్లు ఖర్చు చేశామని, అల్లూరి సీతారామరాజు జిల్లాకు రూ. వెయ్యి కోట్లు కేటాయించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి సంధ్యారాణి ధన్యావాదాలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వసతి గృహాల్లో ఆర్ వో ప్లాంట్ లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే టాయిలెట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఐటీడీఏ లను బలోపేతం చేయడంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏలకు ఐఏఎస్ లను నియామకం చేయడం జరిగిందన్నారు. దీంతో ఐటీడీఏ లు మరింత సమర్థవంతంగా తయారయ్యాయని తెలిపారు. హస్టల్స్ లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ. 105 కోట్లు కేటాయించిందన్నారు. ట్రైకార్ లో దరఖాస్తు చేసుకున్న గిరిజనులకు రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. అలాగే గోకులాల ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు విరివిగా అందిస్తున్నామన్నారు. అంగన్వాడీలకు కిట్లు పంపిణీ చేయడానికి సిద్ధం చేస్తున్నామన్నారు. ముందుగా 6వ జాతీయ స్థాయి వేడులు ఉద్భవ్ 2025 పోస్టర్, లోగో లను మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆవిష్కరించారు. కార్యక్రమంలో గురుకులం కార్యదర్శి శ్రీమతి ఎం. గౌతమి, ట్రైబల్ వెల్ఫేర్ సెక్రెటరీ ఎస్. భార్గవీ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# లింగ వివక్షత పై విస్తృత ప్రచారం కల్పించాలి

(మొదటిపేజీ తరువాయి )

తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, జెండర్ అసమానత్వ సమస్యలు ఎదుర్కొనేందుకు నిర్మాణాత్మక వ్యూహాలను అమలు చేసేందుకు దీన్ దయాళ్ అంత్యోదయ యోజన-నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్, స్వయం సహాయక సంఘాలు, ఇతర ప్రభుత్వ విభాగాలు, వివిధ స్వచ్ఛంద సంస్థలు/పౌర సమాజ సంస్థలు (సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్స్) అనుసంధానంతో చేపట్టారన్నారు. నేటి నుండి 23 డిశంబర్ 2025 వరకు అన్ని జిల్లాల్లో జెండర్ వివక్షతకు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం చేయాలన్నారు. సెర్ప్ కు సంబంధించిన 26 జిల్లాల జిల్లా పథక సంచాలకులు, జిల్లా సమాఖ్యలు, హెచ్.డి విభాగాలు వారు ఇందులో పాల్గొనాలన్నారు. నయీ చేతన 4.0 జెండర్ క్యాంపైన్ ఉద్దేశ్యం వివరించటంతోపాటు 4 వారాల పాటు చేయవలసిన అంశాలను వివరించారు. సమ్మిళిత వృద్ధి కోసం ఆర్థిక సాధికారతకు వికసిత గ్రామీణ భారత్ కు మహిళలు అనే థీమ్ చేపట్టారన్నారు. ముందుగా శ్రీమతి కరుణ వాకటి నయీ చేతన 4.0 జెండర్ క్యాంపైన్ ఉద్దేశ్యాన్ని, 4 వారాల పాటు చేయవలసిన అంశాలను వివరించారు. తొలుత నయీ చేతన 4.0 జెండర్ క్యాంపైన్ ప్రచార పోస్టర్లను, ప్రచార సామాగ్రిని ఆవిష్కరించారు. కార్యక్రమ నిర్వహణకు సంబంధించి జిల్లాకు రూ. 5000/- చొప్పున 660 మండలాకు రూ.4000/- చొప్పున బడ్జెట్ ను విడుదల చేయటం జరిగిందన్నారు. మానవాభివృద్ధి విభాగం డైరెక్టర్ డా. వి. శివశంకర ప్రసాద్ మాట్లాడుతూ నాలుగు వారాలపాటు నిర్వహించే కార్యక్రమంలో వివిధ రకాల థీమ్స్ ద్వారా ప్రజలకి అవగాహన కల్పిస్తామన్నారు. స్వేచ్ఛ ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమములో అన్ని జిల్లాల పథక సంచాలకులు, జిల్లా స్థాయి సిబ్బంది మండల, గ్రామ స్థాయి వరకు వర్చ్యువల్ పద్దతిలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సెర్ప్ అడిషనల్ సీఈవో ఎన్. శ్రీరాములు నాయుడు, డైరెక్టర్లు పి. సుశీల, బి. కృష్ణ మోహన్, ఏ. కళ్యాణ చక్రవర్తి, ఎస్ .జె . దీపక్, సోమయాజులు, స్త్రీనిధి జెనరల్ మేనేజర్ సిద్ధి శ్రీనివాస్ రావు, అదనపు డైరెక్టర్ లు , ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ లు, సెర్ప్ సిబ్బంది, స్త్రీ నిధి సిబ్బంది, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

# హక్కులతో పాటు బాధ్యతలు కూడా ముఖ్యం

- నేటి విద్యార్థులే రేపటి మా భవిష్యత్
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత పెంచేందుకు కృషిచేస్తున్నాం
-మంగళగిరి నా కుటుంబంలా మారిపోయింది
- మాక్ అసెంబ్లీకి ఎంపికైన మంగళగిరి విద్యార్థినిని అభినందించిన మంత్రి లోకేష్



**మంగళగిరి నవంబర్ ( లక్ష్యం న్యూస్)**

అందరూ రాజ్యాంగం కల్పించిన హక్కులు గురించి మాట్లాడతారు. కానీ బాధ్యతల గురించి ఎవరూ మాట్లాడరు. హక్కులతో పాటు బాధ్యతలు కూడా ముఖ్యమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రేపటి స్టూడెంట్ మాక్ అసెంబ్లీకి ఎంపికైన మంగళగిరి విద్యార్థిని కూర్మాల శ్రీ కనకపుట్లమ్మను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు ఉండవల్లి నివాసానికి సదరు విద్యార్థినితో పాటు కుటుంబ సభ్యులను పిలిపించుకుని మాట్లాడారు. మంగళగిరి బీఆర్ నగర్ లోని మున్సిపల్ హైస్కూల్ లో 8వ తరగతి చదువుతున్న శ్రీ కనకపుట్లమ్మ పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి స్టూడెంట్ మాక్ అసెంబ్లీకి ఎంపికైంది.

**నేటివిద్యార్థులే రేపటి మా భవిష్యత్**

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. రాజ్యాంగ దినోత్సవం రోజున విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహణకు సీఎం గారితో మాట్లాడి నిర్ణయం తీసుకోవడం జరిగింది. నేటి విద్యార్థులే రేపటి మా భవిష్యత్. సీఎం చంద్రబాబునాయుడు గారు, ప్రధాని నరేంద్ర మోదీ గారు కూడా యువశక్తి గురించి మాట్లాడుతున్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు కృషిచేస్తున్నాం. అమ్మకు చెప్పకూడని పనులు చేయకూడదని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారు నిన్నటి విలువల విద్యాసదస్సు కార్యక్రమంలో చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తాం. విద్యార్థులు బాగా చదువుకుని ప్రయోజకులుగా మారాలి. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి. ప్రతి ఏడాది స్టూడెంట్ మాక్ అసెంబ్లీ నిర్వహిస్తాం. మిమ్మల్ని చూసి మరో పదిమంది విద్యార్థులు స్ఫూర్తి పొందుతారని మంత్రి అన్నారు. రేపటి మాక్ అసెంబ్లీలో మాకేమైనా సలహాలు, సూచనలు ఇస్తున్నారా అని మంత్రి సరదాగా వ్యాఖ్యానించారు. రేపటి కార్యక్రమానికి సీఎం గారు, స్పీకర్ గారు హాజరవుతున్నారని, జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

# పాము కాటుకు గురై టీడీపీ నేత నరిశెట్టి చిన్నయ్య మృతి



**నాదెండ్లనవంబర్ 25లక్ష్యం న్యూస్**

మండలం లోని కనపర్రు తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు నరిశెట్టి చిన్నయ్య( 55) పాముకాటుతో మంగళవారం మృతి చెందారు. సోమవారం సాయంత్రం పొలం వెళ్లిన ఆయన్ని పాము కరిచింది. నరసరావుపేట ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, జీడీసీబీ మాజీ ఛైర్మన్ మానం వెంకటేశ్వర్లు సంతాపం తెలిపారు. మృతదేహాన్ని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు బండారుపల్లి సత్యన్నారాయణ, నాయకులు వజ్జా సింగయ్య మల్లవరపు జయప్రసాద్, జరుగుల శ్రీనివాసరావు, శౌరీ బాబు, జయరాజు, ఖాజామోహిద్దీన్, అర్లయ్య తదితరులు సందర్శించి నివాళి అర్పించారు.

# అన్నం సతీష్ కు రుణపడి ఉంటాం



**బాపట్ల నవంబర్ 25(లక్ష్యం న్యూస్)**

రాష్ట్రంలో ఉన్న దివ్యాంగుల సమస్యలను పరిష్కరించే విధంగా ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తామని వయోవృద్ధుల సంక్షేమ శాఖ చైర్మన్ గడిపూటి నారాయణస్వామి అన్నారు. డిసెంబర్ మూడో తేదీన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ సభను పురస్కరించుకొని వార్షికోత్సవ సభను స్థానిక ఎన్జీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల సంక్షేమ శాఖ చైర్మన్ గడిపూటి నారాయణస్వామి మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గం లో దివ్యాంగులకు అండగా నిలుస్తూ ఎటువంటి కార్యక్రమం చేసుకున్న చేదోడుగా నిలుస్తూ వందల మంది దివ్యాంగులకు అన్నసంతర్పణ కార్యక్రమం చేసిన అన్నం సతీష్ కు దివ్యాంగులు రుణపడి ఉంటారన్నారు. అనంతరం దివ్యాంగులు సంక్షేమ శాఖ ఏడి మాట్లాడుతూ దివ్యాంగుల బ్యాక్లాగ్ పోస్టులు విడుదల చేస్తామని ఉపకరణాలు అందిస్తామన్నారు. బాబా పూరి దివ్యాంగుల సేవా సమితి అధ్యక్షులు గోగన్ ఆదిశేషు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న దివ్యాంగులు అందరికీ 300 యూనిట్ల ఉచిత కరెంటు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరడంతో పాటు, దివ్యాంగులు పెళ్లి కానుకగా రెండు లక్షల రూపాయలు ఇచ్చి ప్రభుత్వం ఉచితంగా గృహాలు నిర్మించే వాళ్ళని కోరారు. ఈ కార్యక్రమంలో కంది వెంకటరెడ్డి,గొట్టిపాటి లక్ష్మణ్ ,కొల్లు మాధవి,దివ్యాంగులు పాల్గొన్నారు.

# నూతన మందిర ప్రతిష్ఠ మరియు మందిర నిర్మాణ చరిత్ర

- ఎందరో మిషనరీల సేవాఫలితంగా నరసరావుపేటలో బాప్టిస్ట్ సంఘం స్థాపించబడింది
- మేరీకర్ట్జ్ మెమోరియల్ సెంటినరి టౌన్ బాప్టిస్ట్ చర్చి నరసరావుపేట.

**నరసరావుపేట నవంబర్ 25 (లక్ష్యం న్యూస్)::**

క్రీస్తును ఆరాధించేవారి సంఖ్య నానాటికి అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఆరాధనకు ప్రార్థనామందిరం నిర్మించాలనే ఆలోచన నాటి మిషనరీ ఇ. ఇ. సిల్మన్ దొర కి వచ్చింది. ప్రస్తుతము మందిరమున్న స్థలం కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుటకు వారు ఎన్నో అవరోధాలు ఎదుర్కొనవలసి వచ్చింది. ఆ సమయంలో మందిర నిర్మాణానికి సిల్మన్ దొర భార్య సూజీకర్ట్జ చెల్లెలు , మేరీకర్ట్జ్ గ కొంత ధనమును కూడబెట్టినారు. నాటి క్రైస్తవేతర సమాజం ఈ మందిర నిర్మాణాన్ని తీవ్రంగా వ్యతిరేకించి కోర్టులో వ్యాజ్యం వేసినాకూడా మేరీకర్ట్జ్ మరియు సిల్మన్ దంపతులు దేవుని కృపతో ఎదుర్కొని నిలిచారు.నిర్మాణం కాకమునుపే మేరీకర్ట్జ్ దైవసేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనుచూ ఎండ తీవ్రతకు తట్టుకోలేక క్రీ. శ.1912, ఏప్రియల్ 10వ తేదీన ప్రభువు సన్నిధికి చేరారు. వారి భూస్థాపన కార్యక్రమము గుంటూరు నందు జరిగినదని చెప్పబడుచున్నది. మేరీకర్ట్జ్ సమకూర్చిన వనరులకు సిల్మన్ దంపతులు మరికొంత ధనమును జోడించి ఆమె జ్ఞాపక సూచనగా ఈ దైవ మందిరమును మేరీకర్ట్జ్ మెమోరియల్ టౌన్ బాప్టిస్ట్ చర్చ్ గా నిర్మించి 1915 లో ప్రతిష్ఠించారు. దేవుని సువార్త పరిచర్యలో 100 సంవత్సరాలు పూర్తి చేసుకొని ప్రస్తుతము ఈ నూతన మందిరం "మేరీకర్ట్జ్ మెమోరియల్ సెంటినరి టౌన్ బాప్టిస్ట్ చర్చ్" గా పల్నాడు ప్రాంతంలో దేవునికి మహిమకరంగా పరిచర్యలో కొనసాగుతున్నది.

ఈ సంఘములో పని చేసిన కాపరులు

సిల్మన్ దొర వాక్య పరిచర్య చేస్తూనే రెవ. జొన్నలగడ్డ ఫ్రాన్సిస్ ని మొదటి కాపరిగా నియమించారు. ఆ క్రమంలో రెవ. బొంతా యోహాను, రెవ. జొన్నలగడ్డ నతనియేలు, రెవ. తెలగలపూడి పాల్ బెంజిమన్, పాస్టర్ బి. జాన్ బాబు, రెవ.జె.యం.ప్రకాశరావు (వీరు 25 సంవత్సరాల అత్యధిక కాలం కాపరిగా సేవలందించారు), రెవ. పేరిపోగు జ్యోతి సాల్మన్, రెవ. దాసరి విజయదత్తు సేవలు అందించారు. ప్రస్తుతం రెవ. మున్నంగి ఎలీషా సంఘ కాపరిగా బాధ్యతలను కొనసాగించుచున్నారు. ఎందరో కాపరుల సేవా ఫలితం, దైవ జనుల ఆత్మీయ వర్తమానాలు, కార్య నిర్వాహక కమిటీ కృషి, వీటన్నింటిని మించి దేవుని మహా కృప సంఘమును యింత వరకు నడిపించుచున్నది.

113 సం.ఎల విశ్వాస ప్రయాణములో ఒక ముఖ్యమైన మైలురాయి అయిన ఈ నూతన మందిర ప్రతిష్ఠ కొరకై మనమందరము ఏకముగా దేవుని మహిమార్థమై మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తులో బలమైన మరియు సజీవమైన సంఘముగా ఉండుటకు మనలను పునః ప్రతిష్ఠించుకొందుము.

నూతన మందిర ప్రతిష్ఠ ఆరాధనలు

2025, డిసెంబరు 12, 13, 14 తేదీలు (శుక్ర, శని, ఆదివారములు) మరియు 2025, డిసెంబరు 12 శుక్రవారం ఉ? 9:00 గంటల నుండి మ? 1:00 వరకు సా? 6:00 గంటల నుండి రా? 9:00 వరకు,డిసెంబరు 13 శనివారం ఉ? 9:00 గంటల నుండి మ? 1:00 వరకు సా? 6:00 గంటల నుండి రా? 9:00 వరకు, నూతన మందిర ప్రతిష్ఠ ఆరాధన, డిసెంబరు 14 ఆదివారం ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు ప్రేమతో ఆహ్వానించువారు సీనియర్ సంఘ కాపరి- రెవ. ఎలీషా మున్నంగి %ఉ% శ్రీమతి మేరీ ఎలీషా సంఘ విశ్వాసులు, సభ్యులు, పెద్దలు మరియు సి ఓ ఎల్ ఎ సభ్యులు, మేరీకర్ట్జ్ మెమోరియల్ సెంటినరి టౌన్ బాప్టిస్ట్ చర్చి నరసరావుపేట.









# ప్రమాదాలు లేని బాపట్లగా చూడాలి




**బాపట్ల నవంబర్ 25(లక్ష్యం న్యూస్)**

ప్రమాదాలు జరగని బాపట్లగా ప్రతి ఒక్కరూ తీర్చిదిద్దాలని ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ గౌరవాధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు అన్నారు.బాపట్ల కర్లపాలెం రహదారిలో సభ్యులు బీమా కోటేశ్వరరావు ఆర్థిక సహకారంతో ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును మంగళవారం జంక్షన్ వద్ద ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేజెండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో అత్యధిక సంఖ్యలో జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ప్రజలు మరణిస్తున్నారని,రోడ్డు ప్రమాదాల నివారించడానికి ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కొంతమేర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తూ, ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. బాపట్లలో నాలుగు వైపులా ప్రమాదాలు జరగకుండా తమ వంతు బాధ్యతగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తూ ప్రజలలో మరింత అవగాహన కల్పిస్తున్నామన్నారు. పోలీసులు,మోటార్ వాహనాల తనిఖీ అధికారులు నిరంతరం రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు కృషి చేస్తున్నారని అందులో భాగంగా ఆర్గనైజేషన్ సభ్యులు బీమా కోటేశ్వరరావు ఆర్థిక సహాయంతో బాపట్ల కర్లపాలెం రహదారిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశామని చెప్పారు. బీమా కోటేశ్వరరావును ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బంa్రెడ్డి గోపి, కార్యదర్శి బత్తుల సురేష్, సంయుక్త కార్యదర్శి బొగ్గవరపు శివ,కోశాధికారి జోగి సువర్ణరాజు,విన్నకోట శ్రీనివాసరావు, బంd్రెడ్డి అంకమ్మ రావు, పెద్దమల్లు శ్రీకాంత్,సుబ్బారావు, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.




# రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సిరిపురం

## హరి ఏకగ్రీవంగా ఎన్నిక



యద్లపాడు నవంబర్ 25 లక్ష్యం న్యూస్

ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సంక్షేమ సంఘం సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు ముదవర్తి రమేష్ బాబు అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం మండల కేంద్రమైన యద్లపాడులో నిర్వహించారు. రాష్ట్ర కమిటీ సభ్యుల అభిప్రాయం మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చిత్తూరు జిల్లా పలమనేరు మండలం సముద్రపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి సిరిపురం హరి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కమిటీ అధ్యక్షులు ముదవర్తి రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు

# నియోజకవర్గం మార్పు తప్పదా

రాజమండ్రి, నవంబర్ 25, లక్ష్యం న్యూస్ : జనసేనకు చెందిన మంత్రి కందుల దుర్గేష్ ఈసారి నియోజకవర్గాన్ని మార్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆయన నిడదవోలు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కానీ కందుల దుర్గేష్ సొంత ప్రదేశం రాజమండ్రి కావడంతో వచ్చే ఎన్నికల్లో కందుల దుర్గేష్ రాజమండ్రి రూరల్ నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో ప్రస్తుతం టీడీపీ నుంచి సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఉన్నారు. ఆయన వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదు. గత ఎన్నికల సమయంలోనే ఇదే తనకు చివరి ఎన్నిక అని కూడా గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రకటించార. దీంతో వచ్చే ఎన్నికల్లో రాజమండ్రి రూరల్ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించి, నిడదవోలు నియోజకవర్గాన్ని టీడీపీకి కేటాయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కందుల దుర్గేష్ పర్యాటక, సినిమా టోగ్రఫీ మంత్రిగా ఉన్న ప్పటికీ ఆయన ఎక్కువ సమయం రాజమండ్రి లోనే గడుపుతున్నారు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గం జనసేన నేతలు, క్యాడర్ తోనూ ఆయన టచ్ లో ఉండటం కూడా ఈ సందేహాలకు మరింత ఊతమిచ్చినట్లు కనిపిస్తుంది. సీనియర్లను క్రమంగా పక్కన పెడుతున్న టీడీపీ అధినాయకత్వం ఈసారి గోరంట్ల బుచ్చయ్య చౌదరికి కూడా టిక్కెట్ ఇవ్వకపోవచ్చు. ఆయన ఇప్పటికే ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలవడంతో ఆయనకు నామినేటెడ్ పదవి ఇచ్చిపెద్దల సభకు పంపుతామని చెప్పి రాజమండ్రి రూరల్ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయిస్తారని, అక్కడి నుంచి కందుల దుర్గేష్ పోటీ చేయడం ఖాయమని చెబుతున్నారు. టీడీపీకి స్ట్రాంగ్ హోల్డ్ గా ఉన్న... నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా నిడదవోలు నియోజకవర్గం ఏర్పడింది. 2009, 2014 ఎన్నికల్లో అక్కడి నుంచి టీడీపీ అభ్యర్థి బూరుగుపల్లి శేషారావు గెలిచారు. అంటే ఇక్కడ టీడీపీ స్ట్రాంగ్ గా ఉంది. నిడదవోలు టీడీపీ క్యాడర్ నుంచి కూడా వత్తిడి తీవ్రంగా వస్తుంది. అందుకే నిడదవోలను వచ్చే ఎన్నికల్లో టీడీపీ తీసుకుని, రాజమండ్రి రూరల్ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే మంత్రి గా ఉన్న కందుల దుర్గేష్ ఎక్కువగా ఇక్కడే పర్యటిస్తూ క్యాడర్ కు తాను వచ్చేస్తున్నానంటూ సంకేతాలను ఇస్తున్నారట. మొత్తం మీద ఎక్సేంజ్ మేళాలో రెండు సీట్లను పరస్పరం రెండు పార్టీలు మార్పిడి చేసుకుంటాయన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతుంది.

# జగన్ కు దగ్గరవుతున్న జేసీ ఫ్యామిలీ..

**అనంతపురం, నవంబర్ 25, లక్ష్యం న్యూస్ :** అనంతపురం మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి కుమారుడు జేసీ పవన్ రెడ్డి వైసీపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. జేసీ దివాకర్ రెడ్డి ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఆయన వారసుడిగా మొన్నటి ఎన్నికల్లో రాజకీయాల్లో రావాలని భావిస్తే టీడీపీ టిక్కెట్ కేటాయించలేదు. ఒక కుటుంబంలో ఒకరికే టిక్కెట్ అన్న సూత్రంతో జేసీ పవన్ రెడ్డికి టిక్కెట్ ఇవ్వని టీడీపీ నాయకత్వం జేసీ ప్రభాకర్ రెడ్డి కుమారుడు అస్మిత్ రెడ్డికి తాడిపత్రి నియోజకవర్గం టిక్కెట్ ఇచ్చింది. అయితే వచ్చే ఎన్నికల్లోనూ ఒకే కుటుంబానికి ఒకే టిక్కెట్ అనేది టీడీపీ అనుసరిస్తే తాడిపత్రి మాత్రమే జేసీ కుటుంబానికి దక్కుతుంది. అనంతపురం పార్లమెంటు మళ్లీ కూడా దక్కదు. . అందుకే జేసీ పవన్ రెడ్డి వైసీపీకి దగ్గరవుతున్నారని తెలిసింది. అనంతపురం పార్లమెంటు నియోజకవర్గంపై ఇప్పటికీ జేసీ కుటుంబానికి పట్టు ఉంది. అయితే తన తండ్రి సోదరుడు కుమారుడు టీడీపీలో ఉండటం, తాను వైసీపీ లోకి వెళితే ఏ మేరకు కలసి వస్తుందన్న దానిపై ఇంకా తర్జన భర్జన పడుతున్నారని తెలిసింది. జేసీ పవన్ రెడ్డికి ఒక "మెగా" కాంట్రాక్టరు సన్నిహితుడు కావడంతో ఆయన ద్వారా వైసీపీ టిక్కెట్ ను పొందేందుకు ప్రయత్నిస్తున్నారన్న ప్రచారం జరుగుతుంది. నిజానికి మరొకరి సిఫార్సు పవన్ రెడ్డికి పనిలేదు. వైసీపీ అధినేత జగన్ తో సత్సంబంధాలున్నాయి. ఇద్దరూ మంచిమిత్రులేనని అందరూ చెబుతారు. ఎన్నో ఏళ్ల నుంచి వీరి మధ్య మంచి రిలేషన్ నడుస్తుంది. ఇంకా చర్చల దశలోనే... అందుకే వచ్చే ఎన్నికలకు ముందే పవన్ రెడ్డి వైసీపీలో చేరే అవకాశముందని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. టీడీపీలో ఉంటే తమలో ఒక్కరికి మాత్రమే టిక్కెట్ దక్కుతుందని, అందుకని వేర్వేరు పార్టీల్లో ఉండటం మంచిదని భావిస్తున్నారు. అందుకే జేసీ ప్రభాకర్ రెడ్డి కూడా గతంలో మాదిరిగా జగన్ పై వ్యక్తిగత విమర్శలు చేయకుండా ఉండటానికి ఇదే కారణమని చెబుతున్నారు. అయితే దీనిపై జగన్ ఇంకా క్లారిటీ ఇవ్వలేదని తెలిసింది. జేసీ పవన్ రెడ్డి పట్ల జగన్ కు సానుకూలత ఉన్నప్పటికీ జేసీ కుటుంబాన్ని పార్టీలో చేర్చుకుంటే జిల్లాలోనే కాకుండా సీమ జిల్లాల్లో తప్పుడు సంకేతాలు వెళతాయని ఆలోచిస్తున్నారని తెలిసింది. మొత్తం మీద ట్రయల్స్ అయితే మాత్రం జరుగుతున్నాయని సమాచారం. చివరకు జగన్ జేసీ పవన్ రెడ్డి విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటారన్నది చూడాలి.

# హస్తినపై మనస్సులో.. అమరావతిలో తనువు

**ఏలూరు, నవంబర్ 25, లక్ష్యం న్యూస్ :** డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ఎమ్మెల్యే పదవి పట్ల సంతృప్తిగా లేరు. ఆయన చూపంతా హస్తినపైనే ఉంది. గత ఎన్నికల సమయంలో రఘురామ కృష్ణరాజు నరసాపురం పార్లమెంటు టిక్కెట్ కోసం చివర వరకూ ప్రయత్నించారు. అయితే అది బీజేపీ కోటాలోకి వెళ్లిపోవడంతో ఆయనకు ఎక్కడో ఒకచోట స్థానం కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఉండి శాసనసభ నుంచి టీడీపీ పోటీ చేయించింది. గెలిచిన తర్వాత డిప్యూటీ స్పీకర్ పదవిని అప్పగించింది. కేబినెట్ ర్యాంకు పదవి అయినప్పటికీ ఆయన మనసంతా ఢిల్లీపైనే ఉంది. వచ్చే ఎన్నికల నాటికి తాను పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని ఆయన భావిస్తున్నట్లే కనపడుతుంది. ఆయన తన సన్నిహితుల వద్ద చేస్తున్న వ్యాఖ్యలు కూడా ఇలాగే ఉంటున్నాయి.ఆయన తన సన్నిహితుల వద్ద చేస్తున్న వ్యాఖ్యలు కూడా ఇలాగే ఉంటున్నాయి.అయితే అప్పటికే ఉండి నియోజకవర్గానికి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మంతెన రామరాజు ను ఒప్పించి రఘురామ కృష్ణరాజుకు టీడీపీ నాయకత్వం ఆ సీటును కేటాయించింది. మంతెన రామరాజుకు నామినేటెడ్ పోస్టు ఇచ్చింది. ఆయనను ఏపీఐఐసీ ఛైర్మన్ గా నియమించింది. అయితే అక్కడ జనసేన లో కూడా కొంత అసంతృప్తి కనపడుతుంది. ఉండి నియోజకవర్గం తమకు కావాలని గత ఎన్నికల్లోనే జనసేన గట్టిగా పోరాడింది. అయితే రఘురామ కృష్ణరాజు కోసమే కాకుండా,టీడీపీ సిట్టింగ్ సీటు కావడంతో జనసేకు ఇవ్వలేదు. ఉండి జనసేన ఇన్ ఛార్జి నాగరాజుకు ఇప్పటి వరకూ ఎలాంటి పదవి దక్కకపోవడంతో ఆయన అసంతృప్తిగా ఉన్నారని సమాచారం. నాగరాజు శెట్టి బలిజ సామాజికవర్గం నేత కావడంతో ఆయన తన అసంతృప్తిని సన్నిహితుల ముందు వెళ్లగక్కుతున్నారట.మరొకవైపు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు మాత్రం వచ్చే ఎన్నికల్లో ఉండి నుంచి పోటీ చేయడానికి పెద్దగా ఇష్టపడటం లేదు. రఘురామ కృష్ణరాజుకు రాష్ట్ర రాజకీయాల కంటే ఢిల్లీలో ఉండటమే ఎక్కువగా ఇష్టపడతారు. ఆయన ఈసారి గట్టిగా తనకు టిక్కెట్ కావాలని పట్టుబడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో నరసాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి ఇప్పటి నుంచే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారని తెలిసింది. ప్రస్తుతం నరసాపురం ఎంపీగా ఉన్న శ్రీనివాసవర్మ కేంద్ర మంత్రిగా కూడా ఉన్నారు. అయితే ఆయనను తప్పించి రఘురామ కృష్ణరాజుకు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇస్తారా? అన్నది సందేహమే అయినప్పటికీ ఈసారి టీడీపీ కోటాలో నరసాపురం తనకు కేటాయించాలని రఘురామ కృష్ణరాజు పట్టుబట్టే అవకాశముందంటున్నారు

# దూరం.. దూరం అంటూనే .. దగ్గరవుతున్న విజయసాయి

విజయవాడ, నవంబర్ 25,లక్ష్యం న్యూస్ : రాజకీయాలకు గుడ్‌బై..ఇక నుంచి వ్యవసాయం చేసుకుంటానని చెప్పిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి..రూట్ మార్చినట్లు కనిపిస్తోంది. పాలిటిక్స్‌కు గుడ్‌బై చెప్పి ఏడాది కాకముందే ఎప్పుడూ ఏదో ఒక స్టేట్‌మెంట్ ఇస్తూ..ఆసక్తికర ట్వీట్స్ చేస్తూ పొలిటికల్ హాట్ టాపిక్‌గా కొనసాగుతున్నారు. ఇప్పుడేమో ఏ పార్టీలో చేరే ఆలోచన లేదంటారు. మరోసారి అవసరమైతే కొత్త పార్టీ పెడతా అంటారు. తన అవసరం ఉందనుకుంటే రాజకీయాల్లోకి వస్తానంటారు.అసలు ఈ పొంతన లేని స్టేట్‌మెంట్స్ ఎందుకన్న చర్చ జరుగుతోంది. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో విజయసాయిరెడ్డి పాల్గొన్నారు. ఎప్పటిలాగే..జగన్ కోటరీ అంటూ డైలాగులు పేల్చారు. పవన్‌ను పొగిడేందుకు ప్రయత్నించారు. తనకు ఆయనతో 20 ఏళ్ల స్నేహం ఉందని గుర్తు చేసుకున్నారు. ఆయనను తాను ఎప్పుడూ ఒక్క మాట కూడా అనలేదని.. భవిష్యత్‌లో కూడా అనననని చెప్పారు. కానీ గతంలో పవన్‌ను పావలా అని.. విమర్శించిన విషయాన్ని ఆయన మార్చిపోయారంటూ సోషల్ మీడియాలో మీమ్స్ వస్తున్నాయ్.ఎప్పటికప్పుడు సమ్‌థింగ్ డిఫరెంట్ అన్నట్లుగా కామెంట్స్ చేస్తూ వస్తున్నారు విజయసాయిరెడ్డి. మొన్నటివరకు రాజకీయాలకు దూరంగా ఉన్నట్లుగా..పబ్లిక్ వాయిస్‌గా ట్వీట్స్ చేస్తూ చర్చకు దారితీశారు. ఇప్పుడేమో తన అవసరమైతే మళ్లీ పాలిటిక్స్‌లోకి వస్తానంటున్నారు. ఆయన అవసరం పబ్లిక్‌కు ఉందా? లేక ఆయనకే రాజకీయాలు తప్పనిసరిగా మారాయా అన్నది ఇక్కడ పాయింట్. విజయసాయిరెడ్డి అవసరం వైసీపీకి ఉండొచ్చు. ఎందుకంటే గతంలో ఆ పార్టీలో నెంబర్.2గా పనిచేశారు. తెరవెనుక రాజకీయాలు చక్కబెట్టడంలో జగన్‌కు సాయిరెడ్డి బ్యాక్ బోన్ లాంటి వాడని చెప్తుంటారు. అలాంటి విజయసాయిరెడ్డి వైసీపీని వీడినప్పటి నుంచి జగన్ కోటరీని టార్గెట్ చేస్తున్నారు. కోటరీ వల్లే తాను జగన్‌కు దూరమయ్యాను..జగన్‌ను మిస్ అవుతున్నాను అన్నట్లుగా మాట్లాడుతున్నారు విజయసాయిరెడ్డి. తన విషయంలో జగన్ కోటరీ ఆయనను పూర్తిగా డైవర్ట్ చేస్తోందని..అలాంటి వారి మాటలు వినరాదని, అన్నీ ఆలోచించాలని జగన్‌కు సూచించారు. అంటే జగన్ మంచిని కోరుకుంటున్నాను అన్నట్లుగా చెప్పుకొచ్చారు విజయసాయిరెడ్డి.విజయసాయిరెడ్డి మాజీ ఎంపీ మాత్రమే కాదు..మాజీ వైసీపీ నేత, జగన్‌కు అత్యంత సన్నిహితుడు కూడా. ఆయన ఏం మాట్లాడినా పొలిటికల్ యాంగిల్ వెతకడం, దాన్ని హైలెట్ చేయడం కామన్. ఈ నేపథ్యంలోనే లేటెస్ట్‌గా విజయసాయిరెడ్డి చేసిన కామెంట్స్ పొలిటికల్ ఇంట్రెస్టింగ్‌గా మారాయి. సాయిరెడ్డి మనసు వైసీపీ వైపు లాగుతుందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏదో ఒక ఫైన్ మార్నింగ్ విజయసాయిరెడ్డి వైసీపీలో చేరిక ప్రకటన రావొచ్చన్న ఊహాగానాలు ఉండే ఉన్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి 18 నెలలు కావొస్తోంది. వైసీపీ అధినేత జగన్ పార్టీ బలోపేతం కోసం నియోజకవర్గాల్లో పార్టీ వ్యవహారాలను చక్కబెడుతూ వస్తున్నారు. పార్టీకి దూరమైన నేతలను దగ్గర చేసే ప్రయత్నాల్లో పడ్డారు.మొన్నా మధ్య పార్టీని విడిచి వెళ్లిపోయిన నేతలు తిరిగి పార్టీలోకి రావొచ్చు..నో అబ్జక్షన్ అంటూ వైసీపీ ఇంటర్నల్ మీటింగ్‌లో ఓపెన్ ఆఫర్ ఇచ్చారు జగన్. ఈ క్రమంలోనే విజయసాయిరెడ్డి తిరిగి వైసీపీ గూటికి చేరతారని పెద్దఎత్తున ప్రచారం కూడా నడిచింది. అయితే జగన్ నుంచే పిలుపు రావాలని విజయసాయిరెడ్డి ఎదురుచూస్తున్నట్లు ఇన్ సైడ్ టాక్. ఇది ఎంతవరకు నిజమో తెలియదు కానీ..వ్యవసాయం చేసుకుంటానని చెప్పి..విజయసాయిరెడ్డి తరచూ రాజకీయాలు..పొలిటికల్ రీఎంట్రీపై మాట్లాడుతుండటం మాత్రం ఆయనలో ఉన్న పొలిటికల్ ఇంట్రెస్ట్‌ను స్పష్టం చేస్తోంది. రాబోయే రోజుల్లో విజయసాయిరెడ్డి రాజకీయ అడుగులు ఎటువైపు పడతాయో చూడాలి.సైరా నరసింహారెడ్డి సంగతేంటీఇక.. పొట్టి శ్రీరాములు, ఎన్టీఆర్, అన్నమయ్య, అల్లూరి సీతారామరాజు, రాజశేఖర్ రెడ్డి పేరుతో జిల్లాలు ఉన్నాయని.. సైరా నరసింహరెడ్డి పేరును కర్నూలు జిల్లాకు పెట్టాలని ఆయన సూచించారు. అలా చేస్తే ఒక స్వాతంత్ర్య సమరయోధుడిని గౌరవించినట్టు అవుతుందన్నారు. శ్రీకాకుళంలో రెడ్డి సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి మొత్తం నేనే భరిస్తాను అని చెప్పారు. చాలామంది నాపై చాలా సెటైర్లు వేస్తున్నారన్న విజయసాయిరెడ్డి.. ఎవరెన్ని అనుకున్నా నేను ప్రస్తుతం రైతును మాత్రమే అని తేల్చి చెప్పారు.చాలా ఒత్తిళ్లు వచ్చాయి. ప్రస్తుతానికి రాజకీయ పార్టీ పెట్టే ఆలోచన లేదు. ఇతర పార్టీల్లోనూ చేరే ఉద్దేశమూ లేదు. విపరీతమైన ఒత్తిడి వచ్చినా నేను ఎవరికీ లొంగలేదు. జగన్ చుట్టూ ఉన్న కోటరీ ఆయన్ని డైవర్ట్ చేస్తోంది. అందుకే నేను రాజకీయాలకు దూరంగా ఉంటున్నా. నిబద్ధత లేని వారి మాటలు వినొద్దని జగన్ కు నా సూచన. నాకు ఏ పార్టీ నుంచి కూడా పిలుపు రాలేదు. ప్రస్తుతానికి నేను రైతును మాత్రమే.

# కులాంతర వివాహం చేసుకునే యువతులకు తల్లిదండ్రుల నుంచి ప్రాణ రక్షణ కల్పించండి

గుంటూరు నవంబర్ 25( లక్ష్యం న్యూస్ ) కులాంతర వివాహితులను హత్యల నుండి కాపాడాలనిఐద్వా నగర కార్యదర్శి కళ్యాణి, అనురాధ డిమాండ్ చేశారు. కుల గౌరవం పేరుతో కడుపున పుట్టిన బిడ్డలను సైతం హత్యలు చేస్తున్నారని, కుటుంబంలో వారే పసిబిడ్డలపైన అత్యాచారాలకు పాల్పడుతున్నారనిఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై, చిన్నారులపై జరుగుతున్నటువంటి దాడులు, అత్యాచారాలు, హింసను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అన్నారు. హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ,పాత గుంటూరు కోబాల్డ్ పేట లో హింస వ్యతిరేక దినోత్సవం జరిగింది. మద్యం, మత్తు పదార్థాల, ఆశ్లీల వెబ్సైట్లో వల్ల ఈ హింస రోజురోజుకీ



పెరిగిపోతుందని, మైక్రో ఫైనాన్స్, అధిక వడ్డీల వల్ల కూడా మహిళలపై హింస పెరుగుతుందని , దీనిని అరికట్టడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందనిఅన్నారు. మహిళల్ని కాపాడాల్సిన చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారని హత్యలు, అత్యాచారాలు చేసిన నిందితులకు శిక్ష పడడంలో జాప్యం జరుగుతుందనిఅన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసిన కేసులు పరిష్కరించడంలో అలసత్వం జరుగుతుందని అన్నారు. మహిళల హక్కుల్ని, చట్టాలను అమలు చేయాలని ,మహిళల హక్కులను మానవ హక్కులుగా గుర్తించాలనికళ్యాణి, అనురాధ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర కార్య మునెమ్మ ,నందిని తదితరులు పాల్గొన్నారు

# గ్రామ ప్రజలకు పబ్లిక్ టాయిలెట్ల సౌకర్యం కల్పించాలి



:- సిపిఐ పొన్నూరు నియోజవర్గ చెప్పండి కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ

పెదకాకాని, నవంబర్ 25. లక్ష్యం న్యూస్ :

మండల కేంద్రంలో మూడు ప్రధాన పుణ్యక్షేత్రాలు ఉండటంతో ప్రతి వారము వేలాది మంది భక్తులు ఇక్కడికి విచ్చేస్తున్నారని సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ తెలిపారు. అయితే భక్తులకు, ముఖ్యంగా మహిళలకు, పెదకాకాని గ్రామంలో ఎటువంటి పబ్లిక్ మరుగుదొడ్ల నిర్మాణం లాంటి ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడం వలన తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు.

యాత్రికులు ఇబ్బంది పడుతున్న సమయంలో గ్రామ ప్రజలను టాయిలెట్లు ఎక్కడ ఉన్నాయని అడిగి లేవని తెలుసుకొని ఇబ్బంది పడుతున్నారని మరీ ముఖ్యంగా ఆడపడుచులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు , గ్రామంలోని మహిళలు పురుషులు తమ అవసరాల కొరకు పెదకాకాని సెంటర్ కు వచ్చిన తరుణంలో మూత్ర విసర్జన చేయుటకు కూడా వీలులేని పరిస్థితులలో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. స్థానిక మహిళలు వెంటనే మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారని తెలిపారు. ఈ సమస్యను అత్యవసరం గా పరిగణించి సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# డాక్టర్ కృష్ణమోహన్ డాక్టర్ కవిత ను అభినందించిన మర్రి రాజశేఖర్



చిలకలూరిపేట నవంబర్ 25 లక్ష్యంన్యూస్

ప్రముఖ వైద్యులు అమ్మ దంత వైద్యశాల అధినేత,నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ డాక్టర్స్ సెల్ అధ్యక్షులు, రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ పేర్ని కృష్ణమోహన్ పట్టణంలోని పండరీపురం నందు నూతనంగా నిర్మించుకున్న గృహానికి గృహప్రవేశ వేడుక జరిగిన సందర్భంగా శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతం జరుగుచుండగా ఆవేడుకకు శాసన మండలి సభ్యులు మర్రి రాజశేఖర్ లలితమ్మ , సోమేపల్లి వెంకట సుబ్బయ్య హాజరై డాక్టర్ కృష్ణ మోహన్ - డాక్టర్ కవిత లను అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలో వారివెంట పమిడి శ్రీనివాస్ ,గేరా లింకన్ , గ్రంధి ఆంజనేయులు,కూనల సత్యం , షేక్ కరిముల్లా తదితరులు ఉన్నారు

# కట్టుతప్పుతున్న ఎమ్మెల్యేలు

**విజయవాడ, నవంబర్ 25,లక్ష్యంన్యూస్**

2024 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ (టీడీపీ), జనసేన, బీజేపీ కూటమి 164 సీట్లతో అధికారంలోకి వచ్చింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) కేవలం 11 సీట్లతో ప్రతిపక్షంగా మిగిలింది. ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని జగన్ అసెంబ్లీకి రావడం మానేశారు. ఈ "బలహీన ప్రతిపక్షం" కూటమి ప్రభుత్వానికి "సమస్యగా" మారిన సూచనలు కనిపిస్తున్నాయి. తమకు "ఎదురు లేదని" ఎమ్మెల్యేలు కట్టుతప్పుతున్నారు. 2024 ఎన్నికల్లో వైసీపీ 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోవడం రాష్ట్ర రాజకీయాలను పూర్తిగా మార్చేసింది. అవినీతి ఆరోపణలు, పాలనలో ఘోరాలు, రైతులు, మహిళలు, యువతలో అసంతృప్తి కారణంగా వైసీపీ ఘోరంగా ఉడిపోయింది. వైసీపీకి ప్రతిపక్ష హోదాకు అవకాశం లేకపోవడం వల్ల.. అసెంబ్లీ రూల్స్ ప్రకారం 10% సీట్లు అవసరం అయినా రాకపోవడం వల్ల "సైలెంట్ ఓపోజిషన్" స్థితిని సృష్టించింది. ప్రతిపక్ష బలహీనత ప్రభుత్వానికి "ఫ్రీ పాస్" ఇస్తోంది. వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ రాకపోవడం, హౌస్ కమిటీల్లో ఉండకపోవ ఫలితంగా, ప్రభుత్వ నిర్ణయాలపై రాజ్యాంగ వేదికపై ప్రశ్నించడం తగ్గిపోయింది."సరైన ప్రతిపక్షం లేకపోవడం" కూటమి ప్రభుత్వానికి రెండు వైపులా సమస్యలు సృష్టిస్తోంది. ఎదురు లేకపోవడం వల్ల ప్రభుత్వం సులభంగా రీఫార్మ్స్ అమలు చేస్తోంది. జనసేన, బీజేపీలు కూటమి భాగస్వాములు కావడం వల్ల అంతర్గత విమర్శలు తక్కువ. కానీ ప్రతిపక్షం లేకపోవడం "అకౌంటబిలిటీ"ను తగ్గిస్తుంది. వైసీపీ అసెంబ్లీకి రాకపోవడం పార్లమెంటరీ డెమాక్రసీకి దెబ్బ అనుకోవచ్చు. బలమైన ప్రతిపక్షం లేకపోవడం ప్రభుత్వాన్ని "అబ్యూజ్ ఆఫ్ పవర్"కు ప్రేరేపిస్తుంది. ఇప్పుడు అదే జరుగుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. ప్రతిపక్ష బలహీనత వల్ల కొంతమంది ఎమ్మెల్యేలు "కట్టుతప్పుతున్నారన్న"ఆరోపణలుపెరిగాయి. ఎదురు లేకపోవడం వల్ల "చెక్స్ అండ్ బాలెన్సెస్" లేకపోవడం అనైతికతకు దారి తీస్తుంది. ప్రతిపక్షం లేకపోవడం వల్ల ఎమ్మెల్యేలు "సెల్ఫ్-సర్వింగ్" మోడ్‌లోకి వెళ్లారు.అందుకే ఎమ్మెల్యేలపై ఆరోపణలు వస్తున్నాయి. టీడీపీతో పాటు జనసేన పార్టీ ఎమ్మెల్యేలు కూడా కొంత మంది ప్రత్యేకంగా దందాలు చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. స్వయంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేల తీరుపై హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయితే వారిలో ఎంత మంది పట్టించుకుంటున్నారో లేదో స్పష్టత లేదు. ఎమ్మెల్యేల వల్ల ప్రభుత్వానికి ఎంతో ఇబ్బంది ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.ప్రతిపక్షం లేకపోవడం వల్ల "ఇన్‌ఫైటింగ్" పెరిగే అవకాశం కనిపిస్తోంది. టీడీపీ-జనసేన మధ్య ఇలాంటివి తరచూ కనిపిస్తున్నాయి. ప్రభుత్వంలో ఉన్నప్పుడు వివిధ అంశాలపై వేర్వేరు అభిప్రాయాలు సహజమే కానీ.. అవి ప్రతిపక్షం లేకపోవడం వల్ల రావడం సమస్యలు సృష్టిస్తుంది. ప్రతిపక్షం లేకపోవడం వల్ల అకౌంటబిలిటీని తగ్గించి, అనైతిక ప్రవర్తనలకు దారి తీస్తోంది. ఎమ్మెల్యేలు "ఎదురు లేదని" లాభపడుతున్నారనే ఆరోపణలు నిజమవుతున్నాయి. ఇది లాంగ్-టర్మ్‌లో ప్రభుత్వానికి బూమరాంగ్ అవుతుంది. అందుకే కూటమి ప్రభుత్వం జాగ్రత్త పడాల్సిన అవసరం కనిపిస్తోంది.

# గచ్చిబౌలి తరహాలో కొమ్మాది క్రీడా ప్రాంగణం అభివృద్ధి

విశాఖపట్నం లక్ష్యం న్యూస్ :

భీమిలి సమీపంలోని కొమ్మాది క్రీడా ప్రాంగణంలో హైదరా బాద్ గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్ తరహాలో టర్ఫ్ మైదానా న్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఈ నెల 28 నుంచి డిసెంబర్ 10 వరకు చెన్నై, మధురైలలో జరగనున్న హాకీ మెన్స్ జూనియర్ వరల్డ్ కప్ పోటీల ట్రోఫీని ఎమ్మెల్యేలు వెలగపూడి రామ కృష్ణ బాబు, పి. విష్ణుకుమార్ రాజు, సీ. హెచ్. వంశీకృష్ణ శ్రీనివాస్ లతో కలిసి విశాఖ జిల్లా పరిషత్ సమీపంలోని అంకోసా భవనంలో ఆవిష్కరించారు. విశాఖ పట్నం ఆధ్వర్యంలో జరిగిన ఎఫ్ఐహెచ్ హాకీ మెన్స్ జూనియర్ వరల్డ్ కప్ గ్రాండ్ ట్రోఫీ సెలబ్రేషన్స్లో ఎంపీ శ్రీభరత్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ ట్రోఫీని ఆవిష్కరించి, హాకీ క్రీడ అభివృద్ధికి విశాఖపట్నం చేస్తున్న కృషిని అభినందించారు. ఈ ప్రతిష్ఠాత్మక ట్రోఫీ విశాఖకు రావడం గౌరవకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాకీ క్రీడకు విశాఖ అందించిన సహకారాన్ని ఆయన కొనియాడారు.

# రైతన్న నీకోసం

- నరసరావుపేట మండలం గురవాయిపాలెం గ్రామం
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అరవింద బాబు



**నరసరావుపేట నవంబర్ 24 (లక్ష్యం న్యూస్)::**
రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. నరసరావుపేట మండలం గురవాయిపాలెం గ్రామంలో నూతనంగా ప్రవేశపెట్టిన రైతన్న నీకోసం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గురవాయిపాలెం గ్రామంలో అన్నదాత సుఖీభవ పథకం మరియు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) రెండో విడత నిధులు 400 మంది రైతుల ఖాతాలకు నేరుగా జమ అయినట్లు తెలిపారు. ఈ నిధుల ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పించినందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన 'రైతన్న మీకోసం' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గురవాయిపాలెం గ్రామంలో ఇంటింటికీ తిరిగి రైతులతో మమేకమై, వారి సమస్యలను స్వయంగా విన్నారు. నీటి సమస్యలు, ఎరువుల కొరత, రుణ సదుపాయాలు, మార్కెటింగ్ సమస్యలు తదితర అంశాలపై రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నమోదు చేశారు.అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ, పిఎం-కిసాన్, రైతు భరోసా, ఉచిత పంటల బీమా, రైతు సేవా కేంద్రాలు తదితర సంక్షేమ పథకాల గురించి రైతులకు వివరంగా తెలియజేశారు. రైతులు ఈ పథకాల సద్వినియోగం చేసుకోవాలని, ఎలాంటి సమస్య ఉన్నా తనను లేదా స్థానిక అధికారులను ఆశ్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది, గ్రామ పెద్దలు, వందలాది మంది రైతులు పాల్గొన్నారు.

## అమాంతం పెరిగిన గడ్డి ధర: ట్రాక్టర్‌కు రూ. 8 వేలు!

**మాచర్ల: నవంబర్ 25 లక్ష్యం న్యూస్**
వరి కోతలు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో పశువుల మేత (గడ్డి)కు మార్కెట్లో ఒక్కసారిగా భారీ డిమాండ్ ఏర్పడింది. దీంతో గడ్డి ధరలు అమాంతం పెరిగిపోయి, రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఒక ట్రాక్టర్ గడ్డి ధర ఏకంగా రూ. 8,000 వరకు చేరింది.

**దళారుల పెత్తనం పై రైతుల ఆవేదన**
వరి కోతలు అయిన వెంటనే దళారులు పెద్ద ఎత్తున గడ్డిని కొనుగోలు చేసి నిల్వ చేయడంతో మార్కెట్‌లో పశుగ్రాసం కొరత ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ



మేత కొరత, ఆకస్మికంగా పెరిగిన ధరలు తమను దిక్కుతోచని పరిస్థితుల్లోకి నెట్టేశాయని వాపోయారు.
స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం, మాచర్ల పరిసర ప్రాంతాల్లో దళారులు రోజుకు 100 నుంచి 150 ట్రాక్టర్ల గడ్డిని అమ్ముతున్నారు. ఒక్కో ట్రాక్టర్‌లో సుమారు 100 గడ్డి కట్టలు ఉండగా, ఒక్కో కట్టను ఏకంగా రూ. 80 చొప్పున విక్రయిస్తున్నారు. దీంతో ఒక ట్రాక్టర్ గడ్డికి రూ. 8,000 చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ భారీ ఖర్చు తమకు భరించలేని భారంగా మారిందని రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.దళారులు ఇష్టానుసారంగా ధరలు పెంచి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కాబట్టి గడ్డి ధరల

## అమరావతికి ధీటుగా విజయవాడ అభివృద్ధి పురోగతి

### రూ.2వేల కోట్ల అంచనాతో తయారవుతున్న డిపిఆర్



**విజయవాడ నవంబర్ 25 లక్ష్యం న్యూస్**
2029 నాటికి పూర్తి స్థాయి అభివృద్ధి లక్ష్యం ఎంపీ కేశినేని శివనాథ్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ వెల్లడి రూ.93.08 లక్షలతో డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన ముఖ్యఅతిథులుగా ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హాజరు విజయవాడ :రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధి వేగానికి సరితూగేలా విజయవాడ నగరాన్ని తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నదని ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. నగర మౌలిక వసతుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా రూ.93.08 లక్షల వ్యయంతో తూర్పు నియోజకవర్గం 8వ డివిజన్ పాత ఐదో నెంబర్ మార్గంలో మెట్రోపాలిటన్ హోటల్ వద్ద వెయ్యి మీటర్ల డ్రెయిన్ నిర్మాణ పనులకు మంగళవారం ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శంకుస్థాపన చేశారు. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ లకు స్థానిక నాయకులతో కలిసి కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి ఘన స్వాగతం పలికారు. వర్షపు నీటి డ్రైను నిర్మాణ పనులకు కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ విజయవాడ నగరాన్ని పూర్తిస్థాయిలో మార్చేందుకు సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారని, స్ట్రామ్‌వాటర్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి సరఫరా వ్యవస్థలను సమూలంగా మెరుగుపరచాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ లక్ష్యంతో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ.2,000 కోట్ల డిపీఆర్ సిద్ధమవుతోందని వివరించారు. ఈ ప్రణాళిక అమలు అయితే నగరంలో వర్షం పడినప్పుడు చుక్క నీరు కూడా రోడ్డు మీద నిల్వ ఉండకుండా నగరానికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని, కొండప్రాంతాల్లో కూడా మంచి నీటి సరఫరా జరుగుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రత్యేక నిధులతో పెద్దఎత్తున రోడ్లు, డ్రెయిన్ నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు.అనంతరం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ నగర అభివృద్ధిని సమగ్రంగా తీర్చిదిద్దేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ సహకారంతో డిపీఆర్ సిద్ధమవుతున్నదని, వచ్చే రెండేళ్లలో మొత్తం రోడ్లను, ప్రధాన డ్రెయిన్ వ్యవస్థలను, స్ట్రామ్‌వాటర్ లైన్లను, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా పునరుద్ధరించే దిశగా చర్యలు జరుగుతున్నాయని తెలిపారు. విజయవాడ రాజధాని ప్రాంతంగా ప్రకటించబడిన తర్వాత కనకదుర్గమ్మ ఫ్లైఓవర్, బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్ వంటి అనేక ప్రాజెక్టులు అమలయ్యాయి. అయితే మధ్యలో వచ్చిన ఐదేళ్ల గ్యాప్ ద్వారా రాష్ట్రంలో ఎంత వినాశం, ఎంత విధ్వంసం జరిగిందో అందరికీ తెలుసునన్నారు. ఈ ఐదేళ్ల గ్యాప్‌లో నగరం ఎదుర్కొన్న సమస్యలను ఇప్పుడు ప్రణాళికాబద్ధంగా పూడ్చి మళ్లీ అభివృద్ధి పథంలోకి తీసుకువస్తున్నామని తెలిపారు. 2029 నాటికి విజయవాడను అన్ని విధాలుగా పరిశుభ్రంగా, ఆధునికంగా, దేశంలో ఆదర్శ నగరంగా మార్చాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో అడుగులు వేస్తున్నామని స్పష్టం చేశారు.ఇందుకు సంబంధించి ఎంపీ కేశినేని శివనాథ్, విజయవాడ ఎమ్మెల్యేల సలహాలు సూచనలతో ముందుకు



వెళుతున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి మాట్లాడుతూ తన డివిజన్ అభివృద్ధి విషయంలో అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్ ,ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రతి నిత్యం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. డివిజన్ అభివృద్ధి పనులకు స్థానికులు, నివాసితులు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో 8వ డివిజన్ ప్రెసిడెంట్ కొత్తపల్లి రమేష్, క్లస్టర్ ఇన్చార్జ్ సొంగా సంజయ్ వర్మ, శాలివాహన సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరిపి ఈశ్వర్, డివిజన్ మాజీ ప్రధానకార్యదర్శి మల్లెల రామకృష్ణ, బూత్ కన్వీనర్లు మండవ దుర్గా భవానీ, కర్ర సురేష్ , రమణి, మాజీ డివిజన్ అధ్యక్షుడు మెరకనపల్లి నాగేశ్వరరావు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు చలసాని రమణ, టిడిపి లీగల్ సెల్ నాయకులు యెర్నేని వేదవ్యాస్ , టి.ఎన్.టి.యు.సి జిల్లా కార్యదర్శి బద్దూరి వీరారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి దోమకొండ రవి, టి.ఎన్.ఎస్.ఎఫ్ రాష్ట్ర నాయకులు రేపాకుల శ్రీనివాస్, సర్కిల్ 3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, డి.ఈ శాంత కుమార్, స్థానికులు అరుణ , సురేంద్ర, నాగేశ్వరరావు, మనోహర్ ప్రసాద్, జగదీష్, శివయ్య లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## చదువులో వెనుకబడిన విద్యార్థులకు 'సంకల్పం 2026'



**మాచర్ల: నవంబర్ 25 లక్ష్యం న్యూస్ :**
చదువులో వెనుకబడిన విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని గణనీయంగా పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'సంకల్పం 2026' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఎస్,కే,బీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సింగంశెట్టి బాలయ్య వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విద్యాశాఖ కార్యదర్శి రంజిత్ భాష ప్రారంభించినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బాలయ్య మాట్లాడుతూ, ప్రత్యేకంగా రూపొందించిన టైమ్ టేబుల్ ప్రకారం రాబోయే 50 రోజుల్లో విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. 'సంకల్పం 2026' ప్రధాన లక్ష్యం చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా ఉత్తీర్ణత శాతాన్ని మెరుగుపరచడమేనని స్పష్టం చేశారు.అలాగే, ప్రతి సబ్జెక్టులోనూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధన పద్ధతులను అనుసరించాలని కళాశాల లెక్చరర్లకు ఆయన సూచించారు. ఈ ప్రత్యేక కార్యాచరణ ద్వారా విద్యార్థుల విద్యాస్థాయిలో మార్పు తీసుకొస్తామని ప్రిన్సిపాల్ బాలయ్య ఆశాభావం వ్యక్తం చేశారు.

## గుడిమెట్ల గ్రామపంచాయతీ మంచినీటి స్కీమ్ ను పునః ప్రారంబించిన

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**గుడిమెట్ల నవంబర్ 25 లక్ష్యం న్యూస్**
నందిగామ నియోజకవర్గం గుడిమెట్ల గ్రామపంచాయతీ పరిధిలో మరమ్మత్తులు పూర్తి అయిన మంచినీటి స్కీమ్‌ను మంగళవారం నాడు గ్రామ సర్పంచ్, కూటమి నేతలు మరియు అధికారులు సమక్షంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య లాంఛనంగా పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపడుతూ, నీటి సరఫరా వ్యవస్థలను మరింత బలోపేతం చేస్తామని భరోసా ఇచ్చారు. గ్రామ అభివృద్ధిలో భాగస్వాములయ్యే సంస్థలు మరియు ప్రజాప్రతినిధుల సహకారం కీలకమని



పేర్కొన్నారు.మంచినీటి స్కీమ్ మరమ్మత్తులకు అవసరమైన సహకారం అందించిన క్రిక్స్ బయో ఇథనాల్ కంపెనీ ప్రతినిధులకు ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక బాధ్యతగా సంస్థ అందించిన సహాయం వల్ల గ్రామ ప్రజలకు మేలు చేకూరుతుందని కొనియాడారు.ఈ



కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, కూటమి నాయకులు, సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పునః ప్రారంభంతో గ్రామంలో తాగునీటి సరఫరా సమస్యలు పరిష్కారమై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## సహకార రంగంలో 50% రిజర్వేషన్ కేటాకల్పించాలి




**గుంటూరు నవంబర్ 25 లక్ష్యం న్యూస్**
సహకార రంగం, స్థానిక సంస్థల ఎన్నికలలో ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనారిటీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం అరండల్ పేటలోని రైల్వే ఎస్ సి ,ఎస్ టి వెల్ఫేర్ సమావేశ మందిరంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. యునైటెడ్ ముస్లిం ఫ్రంట్ అధ్యక్షులు కలీం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి, ఆయా సంఘాల నేతలు నరసింహారావు, వరప్రసాద్ భగత్ సింగ్, జూపూడి శ్రీనివాసరావు ,విజయలక్ష్మి తదితరులు హాజరయ్యారు. సహకార రంగంలో దాదాపు 25వేల పాలకవర్గ పోస్టుల్లో ఎస్సీ ,ఎస్టీ ,బీసీలకు సక్రమ ప్రాతినిధ్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు .అగ్రకులాల వ్యక్తులే అన్నింటా సాగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు .సీఎం చంద్రబాబు జోక్యం చేసుకుని 50% రిజర్వేషన్ కోటా కల్పనకు అసెంబ్లీలో బిల్లు పెట్టాలన్నారు. కేంద్రానికి పంపి రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చేందుకు కృషి చేయాలన్నారు.తద్వారా ఎస్సీ ఎస్టీ మైనారిటీలకు న్యాయం జరుగుతుందని కలీం వివరించారు.

## అన్న క్యాంటీన్లలో సురక్షిత మంచినీరు అందించండి

**గుంటూరు నవంబర్ 25( లక్ష్యం న్యూస్)**
అన్నక్యాంటీన్లలోని సంప్ లు, వాటర్ ట్యాంక్ లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, ఏఈల వారీగా మెరుగైన పర్యవేక్షణ చేయాలని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం ఆర్టీఓ కార్యాలయం, పల్నాడు బస్టాండ్ సెంటర్ లోని అన్న క్యాంటీన్లను కమిషనర్ మధ్యాహ్నం భోజన సమయంలో ఆకస్మికంగా పరిశీలించి, వారితో కలిసి భోజనం చేసి, ప్రజలతో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అన్న క్యాంటీన్లలో ఆహారం తీసుకునేవారి సంఖ్యరోజురోజుకిపెరుగుతున్నందున, అందుకు తగిన విధంగా పరిశుభ్రత పట్ల సిబ్బంది ప్రత్యేక



శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రధానంగా నీటి సరఫరాకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆహార సరఫరా అనంతరం ప్రాంగణం శుభ్రం చేయాలని అక్షయపాత్ర సిబ్బందిని ఆదేశించారు. డస్ట్ బిన్లను భోజనం చేసే ప్రాంతానికి



దూరంగా ఉంచాలన్నారు. మౌలిక వసతుల కల్పనకు జిఎంసి నోడల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని అక్షయ పాత్ర సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బి.స్మిత పద్మజ, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## కృష్ణవేణి డిగ్రీ కాలేజీలో వాలీబాల్ టోర్నమెంట్

### ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించిన నరసరావుపేట ఎమ్మెల్యే అరవింద బాబు






**నరసరావుపేట నవంబర్ 25 (లక్ష్యం న్యూస్)::**
నరసరావుపేటలోని చిలకలూరిపేట రోడ్డులో ఉన్న కృష్ణవేణి డిగ్రీ కాలేజీలో మంగళవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇంటర్ కాలేజియేట్ వాలీబాల్ (పురుషులు) టోర్నమెంట్-2025 (ఆనిక్ వాలీబాల్ పురుషుల టోర్నమెంట్- 2025) కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. ఆయన టోర్నీని ప్రారంభించి, ఆటగాళ్లను ఉత్సాహపరిచారు. విద్యార్థులలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడం, శారీరక దృఢత్వం సాధించడం ఈ విధమైన కార్యక్రమాల ద్వారానే సాధ్యమని ఆయన అన్నారు. ఈ టోర్నమెంట్‌లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న వివిధ కాలేజీల నుంచి పలు జట్లు పాల్గొన్నాయి. కాలేజీ అధ్యక్షులు, ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాలో లోపాలు సరిదిద్దాలి

### బి ఎల్ వోల తో తహసీల్దార్ - మున్సిపల్ కమిషనర్ సమీక్షా సమావేశం...

**మాచర్ల, (నవంబర్ 25):**
మాచర్ల పరిధిలోని గ్రామీణ (రూరల్) మరియు పట్టణ (అర్బన్) ప్రాంతాలలో ఓటర్ల జాబితా ప్రత్యేక సారాంశ సవరణ (సర్) పనులు, నూతన ఓటర్ల నమోదు ప్రక్రియపై తహసీల్దార్ కిరణ్ కుమార్ మరియు మున్సిపల్ కమిషనర్ వేణుబాబు సంయుక్తంగా బూత్ లెవల్ అధికారులతో విస్తృత సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఓటర్ల జాబితాలో తలెత్తుతున్న అవకతకలు మరియు లోపాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు.

**ఇంటింటి సర్వే తప్పనిసరి:**
ఓటర్ల జాబితా నూరు శాతం సక్రమంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత బిఎల్ఓ లదేనని తహసీల్దార్ కిరణ్ కుమార్ స్పష్టం చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి, ఓటరు వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. డూప్లికేట్ ఓట్లు (నకిలీ ఓట్లు), మరణించిన వ్యక్తుల పేర్లు ఇంకా జాబితా నుంచి తొలగించకపోవడం వంటి అవకతకలను వెంటనే గుర్తించి, వాటిని సరిచేయాలని లేదా తొలగించాలని సూచించారు. ఒకే కుటుంబంలో తప్పుగా నమోదైన వివరాలను కూడా



సరిదిద్దాలని ఆదేశించారు.

**కొత్త ఓటర్లపై ప్రత్యేక దృష్టి:**
మున్సిపల్ కమిషనర్ వేణుబాబు మాట్లాడుతూ, కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి అర్హులైన యువతను గుర్తించి, వారిని నిర్ణీత గడువులోగా నమోదు చేయించేలా బి ఎల్ వోలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గ్రామ సభలు, పట్టణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో ఓటు నమోదు పట్ల ఆసక్తిని పెంచాలని సూచించారు.సమావేశంలో బిఎల్ఓ లు తమ ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు, శిక్షణకు సంబంధించిన అంశాలను అధికారులకు వివరించగా, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు హామీ ఇచ్చారు. ఇకపై ప్రతి పనిని కచ్చితమైన సమయపాలనతో, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని, ఓటర్ల జాబితాలో ఎటువంటి పొరపాట్లకు తావు ఇవ్వకూడదని ఇద్దరు అధికారులు ఈ సందర్భంగా ఉద్ఘాటించారు.

# మహిళా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పయనిస్తాం

**గుంటూరు నవంబర్ 25 (లక్ష్యం న్యూస్ )**

ప్రతి మంగళవారం తాను ప్రత్యేకంగా నిర్వహించే మహిళా గ్రీవెన్స్ డే కు విశేషస్పందన లభించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే మాధవి అన్నారు.గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే మంగళవారం ప్రత్యేకంగా మహిళా గ్రీవెన్స్ డే ఆరవవారం విజయవంతంగా జరిగింది.ఎమ్మెల్యే , ప్రతి మహిళతో ఒక్కొక్కరితో సమావేశమయ్యారు. గత ఆరు వారాలలో మొత్తం 300కు పైగా మహిళల నుండి అర్జీలు స్వీకరించగా, వాటిలో దాదాపు 200 అర్జీలకు ఇప్పటికే సమాధానాలు ఇవ్వడం, సమస్యలను సంబంధిత శాఖలకు పంపించి పరిష్కార దిశగా తీసుకెళ్లడం జరిగినట్లు మాధవి తెలిపారు. మిగిలిన పెండింగ్ గ్రీవెన్సులను కూడా క్రమం తప్పకుండా ఫాలోఅప్ చేసుకుంటూ మహిళల కోసం ప్రత్యేకంగా పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.పశ్చిమ నియోజకవర్గంలో మహిళలు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునే వేదికగా మంగళవారం గ్రీవెన్స్ డే ఒక మంచి ఆదరణ పొందుతోందన్నారు.ప్రజల సమస్యలను పరిష్కరించడం తన బాధ్యతగా భావిస్తున్నానని, మహిళల సమస్యలు వింటూ, అవి పరిష్కారమవుతున్నప్పుడు



కలిగే సంతృప్తి ఎంతో గొప్పదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి మహిళల పక్షంలో నిలబడి, ఆడపిల్లలు ఎక్కడా ఇబ్బంది పడకుండా ఉండేలా కార్యాచరణ చేపడుతున్నామని తెలిపారు.అదేవిధంగా పిచ్చి మొక్కలు, ఖాళీ స్థలాల సమస్యలు, కుక్కల బెడద, డ్రైనేజ్ ఇబ్బందులు, రోడ్లు లేకపోవడం వంటి స్థానిక అభివృద్ధి సమస్యలతో పాటు కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, కుటుంబ వేదింపుల సంబంధిత ఫిర్యాదులు కూడా ఎక్కువగా వస్తున్నాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ కేసులన్నింటినీ లాయర్ విజయలక్ష్మి గారి సహకారంతో త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దిశా స్టేషన్ నుండి ఒక ఎస్సై ను ఆఫీసుకు డ్యూటీకి పంపేలా ఏర్పాటు చేసి, మహిళల లా & ఆర్డర్ సమస్యలను తక్షణమే పరిష్కరించడం జరుగుతోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.పశ్చిమ నియోజకవర్గంలో గంజాయి నిర్మూలన కోసం ఎస్పీ గారికి ప్రత్యేక లేఖ ఇచ్చినట్లు, గంజాయి సంబంధిత స్పాట్‌లను గుర్తించి అందజేసిన ప్రదేశాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నందుకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం 80% వరకు గంజాయి సమస్య నియంత్రణలోకి వచ్చిందని, ఇకపై పూర్తిగా నిర్మూలించాలని లక్ష్యంగా కృషి కొనసాగుతున్నట్లు తెలిపారు.మహిళల సంక్షేమం కోసం తమ ఆఫీస్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఇంకా తెలియని మహిళలు కూడా ఈ గ్రీవెన్స్ డేను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.

# శరీరానికి సహజ ఔషధం: తాటి బెల్లం...

**ఐరన్, ఖనిజాల గనిజీ పంచదార కంటే 50 రెట్లు ఎక్కువ పోషకాలు..**

**ఆయుర్వేదంలో తాటి బెల్లం ప్రాముఖ్యతపై ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డా. ఆర్. శ్రీనివాస్ వివరణ**

**మాచర్ల నవంబర్ 25 లక్ష్యం న్యూస్**



తాటిచెట్టు నుంచి లభించే నీరాను ఉడికించి తయారుచేసే తాటి బెల్లం కేవలం తీపి పదార్థం మాత్రమే కాదు, ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే సహజ ఔషధమని ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. సాధారణ చక్కెర లేదా చెరకు బెల్లంతో పోలిస్తే, ఇందులో ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజ లవణాలు 50-60 రెట్లు అధికంగా ఉంటాయని ఆయన వివరించారు. ఈ పోషకాలు శరీరానికి ఎలా మేలు చేస్తాయో ఆయన ముఖ్యమైన ఉపయోగాలుగా వివరించారు.

### ముఖ్య ఉపయోగాలు

**రక్తహీనత నివారణ:** ఇందులో ఐరన్ అధికంగా ఉండటం వల్ల హిమోగ్లోబిన్ స్థాయిలు పెరిగి, రక్తహీనత (అనీమియా) తగ్గుతుంది. ముఖ్యంగా మహిళలు, ఎదుగుతున్న పిల్లలకు ఇది చాలా మంచిది.

**జీర్ణక్రియ మెరుగు:** భోజనం తర్వాత చిన్న ముక్క తాటి బెల్లం తినడం వల్ల జీర్ణశక్తి మెరుగుపడి, మలబద్ధకం తగ్గుతుంది. ఇది పేగులను శుభ్రపరిచేందుకు సహాయపడుతుంది.శరీర శుద్ధి **(డీటాక్స్):** కాలేయం, రక్తం, పేగుల్లోని వ్యర్థ పదార్థాలను తొలగించి, శరీరాన్ని లోపలి నుంచి శుభ్రపరుస్తుంది.

**ఎముకలు దృఢత్వం:** కాల్షియం, మెగ్నీషియం సమృద్ధిగా ఉండటం వల్ల కీళ్ల నొప్పులు, ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యల నివారణకు తోడ్పడుతుంది.శ్వాసకోశ ఉపశమనం: జలుబు, దగ్గు, గొంతు నొప్పి వంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. శీతాకాలంలో శరీరాన్ని వెచ్చగా ఉంచుతుంది.

**మెరుగైన చర్మం:** యాంటీ-ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వల్ల మొటిమలు, మచ్చలు తగ్గి, చర్మం ఆరోగ్యంగా, అందంగా మెరుస్తుంది.మైగ్రేన్ ఉపశమనం: ఉదయం ఖాళీ కడుపున కొద్దిగా తీసుకోవడం వలన మైగ్రేన్ తలనొప్పి బాధ నుంచి ఉపశమనం లభిస్తుంది.ఒత్తిడి నివారణ: మెగ్నీషియం ఉండటం వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గి, మనసు ప్రశాంతంగా ఉంటుంది.

**బరువు నియంత్రణలోనూ...**

తాటి బెల్లం యొక్క గ్లైసెమిక్ ఇండెక్స్ (సుమారు 35-50) తక్కువగా ఉంటుంది. దీని వల్ల సాధారణ చక్కెరలాగా రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగవు. ఇందులో ఉండే పొటాషియం కారణంగా వాటర్ రిటెన్షన్ (శరీరంలో నీరు నిల్వ ఉండటం) తగ్గి, బరువు తగ్గడానికి కూడా ఇది పరోక్షంగా సహాయపడుతుంది.

**మహిళలకు ప్రత్యేకం:**

నెలసరి (పీరియడ్స్) సమయంలో వచ్చే నొప్పులు తగ్గుతాయి. బాలింతలకు పాల ఉత్పత్తి పెరగడానికి కూడా ఇది దోహదపడుతుంది.

**ఎలా వాడాలి?**

రోజూ 10 నుంచి 20 గ్రాములు (చిన్న ముక్క) మాత్రమే వాడాలి.టీ, కాఫీ, పాయసం, లడ్డూలు వంటి వాటిలో పంచదారకు బదులుగా దీనిని ఉపయోగించవచ్చు.భోజనం తర్వాత ఒక చిన్న ముక్క తింటే జీర్ణక్రియ మెరుగుపడుతుంది. గమనిక: తాటి బెల్లం ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ, మధుమేహం (డయాబెటిస్) ఉన్నవారు లేదా బరువు తగ్గాలనుకునేవారు తమ డాక్టర్ సలహా తీసుకున్న తర్వాత మాత్రమే దీనిని వినియోగించాలని డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. పంచదార స్థానంలో తాటి బెల్లాన్ని చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆయన తెలిపారు.

# నూతన సాగు విధానంతో రాష్ట్ర వ్యవసాయ రంగం దేశానికి ఆదర్శం..

## కొండవీడు లో రైతన్నా మీకోసం కార్యక్రమం

**యడ్లపాడునవంబర్ 25లక్ష్యం న్యూస్**

స్వర్ణాంధ 2047 లక్ష్యంలో భాగంగారాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ, అనుబంధ రంగాల్లో సగటున 15 శాతం వృద్ధిరేటు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం "రైతన్నా మీకోసం" కార్యక్రమాన్ని ప్రారంభించిందని, మాజీ మంత్రి శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాలతో ఈ కార్యక్రమం మండలంలో ఈ నెల24న ప్రారంభించమని 29 న ముగుస్తుందని మండల పార్టీ అధ్యక్షుడుకామినేని సాయిబాబాఅన్నారు. మండలంలోని కొండవీడు లో జరిగిన కార్యక్రమం లో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ టిడిపి కరీముల్లా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నందునే సకాలంలో రైతుల ఉత్పత్తుల కొనుగోళ్లు, మద్ధతు ధరల అమలు సాధ్యమైందని, నూతన సాగు విధానాలతో రాష్ట్ర వ్యవసాయరంగాన్ని దేశానికే ఆదర్శంగా నిలపాలన్న గట్టి పట్టుదలతో సీఎం ఉన్నారని అన్నారు. రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ప్రారంభించి గ్రామంలోని రైతుల ఇళ్లకు వెళ్లి



ముఖ్యమంత్రి రైతాంగానికి రాసిన లేఖతో పాటు, ప్రభుత్వం అమలుచేయాలనుకుంటున్న నూతన సాగువిధానాలు.. అందించే సబ్సిడీలు, ప్రోత్సాహకాలను వారికి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరు సదాశివరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ టిడిపి కరీముల్లా, మండల పార్టీ అధ్యక్షులు కామినేని సాయిబాబు, తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి పోపూరి వెంకయ్య, నీటి సంఘం అధ్యక్షులు



పోపూరి రాఘవయ్య, మండల తెలుగు రైతు అధ్యక్షులు కనపర్తిలక్ష్మీప్రసాద్, మండల జనసేన పార్టీ అధ్యక్షులు పి హనుమంతరావు, జనసేన పార్టీ నాయకులు తోట నాని, ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె అమల కుమారి, మండల హార్టీకల్చర్ అధికారి ఆర్ శ్రీలక్ష్మి, గ్రామ హార్టీకల్చర్ అసిస్టెంట్ పి కృష్ణ సౌజన్య, 60వ నెంబర్ బూత్ కన్వీనర్ కాశీ రామారావు, కొండవీడు పార్టీ నాయకులు షేక్ షఫీ, గంటా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# గాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆర్ డి ఓ కి మెమోరాండంసమర్పణ



**నందిగామ నవంబర్ 25 లక్ష్యం న్యూస్**

నందిగామబ్రాహ్మణశ్రేయోభిలాషులకుగాయత్రిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆర్ డిఓ కి మెమోరాండం ఇవ్వడం జరిగింది నాస్తికత్వం ముసుగులో బ్రాహ్మణులను కించపరుస్తూ చేసినటువటి వీడియో పాటకు వ్యతిరేకంగా అందరిమద్దతు కోరుకుంటున్నామనిఇలా ఒకకులాన్ని కేంద్రం చేసి సమాజాన్ని విభజించే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని కోరుకుంటున్నాను అనిపేరు కోసం డబ్బుల కోసం సినిమాలలో వీడియోలలో సమాజ మంచి కోరే బ్రాహ్మణులకు కించపరచడం ఫ్యాషన్ అయిపోయిందిఅని బీజేపీ సీనియర్ నాయకులు కేదార్నాద్ శర్మఆవేదన వ్యకపరిచారు.

# పశు వైద్య శిబిరాలను రైతులు ఉపయోగించుకివాలి.

**కర్లపాలెం నవంబర్25 లక్ష్యం న్యూస్**

గ్రామాలలో నిర్వహిస్తున్న ఉచిత మెగా పశువైద్య శిబిరాలను రైతులు ఉపయోగించుకోవాలని విజయవాడ డైరెక్టరేట్ జాయింట్ డైరెక్టర్ టి వి సుధాకర్ పేర్కొన్నారు.కర్లపాలెం మండలం యాజలి గ్రామంలో రాష్ట్రీయా గోకుల్ మిషన్ ఆంధ్ర ప్రదేశ్ పశుగణభివృద్ధి సంస్థ ,పశు సంవర్ధక శాఖ మరియు శ్రీ సత్య సాయి సేవ సమస్థలు బాపట్ల జిల్లా గ్రామ సేవల విభాగం సంయుక్తంగా మెగా ఉచిత వైద్య శిబిరం మరియు మేలు జాతి లేగ దూడల అందాల పోటీ ను నిర్వహించారు. ఈ శిబిరంలో 115 పశువులకు గర్భ కోశ వ్యాధి చికిత్స,800 జనరల్ కేసులు,200 దూడలకు నట్టల నివారణ చేయడం జరిగింది.120 లేగ దూడలు అందాల పోటీలో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు డాక్టర్ అన్సారీ,కిరణ్ ,తిరుమల తేజ,సాహిత్య,నాగార్జున, రేచల్ దివ్య,శివ కుమారి,వనజా లక్ష్మీలు పాల్గొని గర్భకోశ వ్యాధులు,జనరల్,నట్టల నివారణకు వైద్య పరీక్షలు నిర్వహించి విశ్రాంత డాక్టర్ పున్నయ్య శాస్త్రి సమకూర్చిన మందులను అందజేశారు.లేగ దూడల ప్రదర్శన నిర్వహించి ప్రథమ ద్వితీయ,తృతీయ బహుమతులు, రైతులకు కన్సలైంట్ బహుమతులు అందజేశారు.పశువుల రైతులకు జామ, మామిడి మొక్కలను శ్రీ మంతెన నాగరాజు ,శ్రీరామకృష్ణ కల్చరల్ అసోసియేషన్, బుద్దాం వారు అందజేశారు.ఈ కార్యక్రమంలో డి.ఎ.హెచ్. ఓ. బాపట్ల డా. వి.వేణు గోపాల్ , ఈ.ఓ. డీఎల్ డి ఏ వై.సుధాకర్ , ఏ డి వి.శ్రీనివాసరావు ,బాపట్ల మండలం




మాట్లాడుతున్న జే డి సుధాకర్.

గ్రామ సేవల విభాగం జిల్లా ఇంచార్జి తుమ్మల శ్రీనివాసరావు, ఇంచార్జి కన్వీనర్ అచ్యుత వెంకన్న,ఇంకొల్లు శ్రీనివాసరావు, పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదాల నివారణలో మనమంతా భాగస్వామ్యులు అవుదాం

## బందరు డిఎస్పి శ్రీ సిహెచ్ రాజాలి






**మచిలీపట్నం నవంబర్ 25 లక్ష్యం న్యూస్**

జిల్లా ఎస్పీ శ్రీ V.విద్యాసాగర్ నాయుడు ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు ఈరోజు NH 216 జాతీయ రహదారిపై




బందరు డిఎస్పి సిహెచ్ రాజా గారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.రోడ్డు భద్రత మరియు రోడ్డు ప్రమాదాల నివారణకు పలు అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది.ఈ సందర్భంగా డీఎస్పీ గారు మాట్లాడుతూ వాహనదారులు అందరూ, రోడ్డు భద్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,ట్రాఫిక్ రూల్స్ పాటించి, తక్కువ వేగంతో వాహనాలలో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని, రోడ్డు ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వ్యక్తులను కోల్పోవడమే కాకుండా, కుటుంబాలు ఆర్థికంగానూ, సామాజిక గాను వెనుకబడటానికి రోడ్డు ప్రమాదాలు కారణమవుతున్నాయన్నారు.మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, ట్రాఫిక్ చిహ్నాలను గుర్తుంచుకొని దానికి తగిన విధంగా వాహనాల నడపాలని తెలిపారు.వాహనాలను నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి. ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి.వాహనదారులు ట్రాఫిక్ పోలీస్ వారికి సహకరిస్తూ ట్రాఫిక్ ఎలాంటి అంతరాయం లేకుండా నడపాలని తెలియచేసారు.ఈ కార్యక్రమంలో బందరు డిఎస్పి చప్పిడి రాజా గారు మరియు ట్రాఫిక్ CI నున్న రాజు గారు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేడు చింతల తండాలో రైతన్నా మీ కోసం



**మాచర్ల రూరల్ : 25 నవంబర్ (లక్ష్యం న్యూస్)**

రైతును ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని మాచర్ల మండలం, చింతలతండాలో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. బుధవారం ఉదయం 9 గంటలకు గ్రామంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి నూతన ప్రతిష్ట మహోత్సవములో పాల్గొని,ప్రత్యేక పూజలు నిర్వహించిననంతరం రైతన్నా మీ కోసం కార్యక్రమం ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, ప్రజలు, అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# రైతన్న మీకోసం సర్వేను పరిశీలించిన మార్కెట్ యార్డ్ చైర్మన్



**మచిలీపట్నం నవంబర్ 25 లక్ష్యం న్యూస్**

మార్కెట్ యాడ్ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని) గారు సుల్తానగరంలో జరుగుతున్న రైతన్న మీకోసం సర్వేని పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గౌరవనీయులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, గౌరవనీయులు డిప్యూటీ చీఫ్ మినిస్టర్ పవన్ కళ్యాణ్ గారు, మంత్రి కొల్లు రవీంద్ర గారు ప్రవేశపెట్టిన రైతన్న మీకోసం సర్వే రైతులకు ఎంతో బాగా ఉపయోగపడుతుందని, ఈ సర్వేలో భాగంగా రైతు సేవా కేంద్రం అధికారులు రైతులు వద్దకే వెళ్లి రైతులకు వ్యవసాయం లో ఆధునిక టెక్నాలజీని ఏ విధంగా ఉపయోగించుకోవాలి, పురుగు ముందు తగ్గించి సేంద్రియ వ్యవసాయం ఏ విధంగా చేపట్టాలి తదితర విషయాలను తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం ప్రతినిధులు మరియు స్థానిక నాయకులు చిట్టి బొమ్మ వనరాజు మరియు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నిర్మల్ హృదయ లో ఆత్మీయంగా 'పొదిల' జన్మదిన వేడుకలు

**గుంటూరు నవంబర్ 25 (లక్ష్యం న్యూస్)**

గుంటూరు తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి పొదిలవాసు జన్మదిన వేడుకలు మంగళవారం బ్రాడీపేట నిర్మల్ హృదయ లో ఘనంగా జరిగాయి. నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యే గళ్ళ మాధవి ,మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ వెన్న సాంబశివరెడ్డి ,తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతలు కసుకుర్తి హనుమంతరావు, మలి, కేశవ ,వెంకట్ తదితరులు హాజరయ్యారు. నిర్మల్ హృదయలోని అభాగ్యులకు కేకులు,పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే నిర్మల్ హృదయకు,మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యే గళ్ళ మాధవి చేతుల మీదగా 50 వేల రూపాయల చెక్కును, పొదిల వాసు వితరణ గావించారు. వాసు సేవా గుణాన్ని,దృక్పదనీని ,నిర్మల హృదయ సిస్టర్స్ తో పాటు అందరూ అభినందించారు. అనంతరం అభాగ్యుల మధ్య కేక్ కట్ చేసి పంచుకున్నారు. తెలుగుదేశం పార్టీ పురోభివృద్ధికి వాసు విశేష కృషి చేశారని మేయర్ రవీంద్ర కొనియాడారు.ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి ,వాణిజ్య విభాగం ద్వారా వాసు చేసిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత




పదవులు అధిరోహించాలని అన్నారు. సంపూర్ణ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు తో నిండు నూరేళ్లువాసు వర్ధిల్లాలని రవీంద్ర ఆకాంక్షించారు .ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ, పొదిలవాసు ,పార్టీ పురోభివృద్ధికి రథసారధిగా నిలిచారని కొనియాడారు. భవిష్యత్తులో పార్టీ ప్రతిష్టానికి ఆయన మరింత కృషి సాగిస్తారని అన్నారు. పార్టీలో ,ప్రభుత్వంలో ఆయనకు మంచి భవిష్యత్తు ఉంటుందని మాధవి అన్నారు. టిడిపి సీనియర్ నేతలు వెన్న సాంబశివరెడ్డి, కస్సుర్తి హనుమంతరావు, తదితరులు



మాట్లాడారు. పొదిలకుఆత్మీయంగా శుభాకాంక్షలు తెలిపారు. అభాగ్యులను అక్కున చేర్చుకుని ఆదరిస్తున్న నిర్మల్ హృదయ కి 50 వేల రూపాయలను వాసు అందించడం, ఆయన సేవ తత్వానికి నిదర్శనమని కొనియాడారు.ఈ సందర్భంగా అతిధులకు వాసు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ ,ప్రభుత్వ పటిష్టానికి ,సమాజ సేవకు ముందు ఉంటానని ప్రకటించారు.

## అసభ్య ప్రవర్తన కలిగిన హెూంగార్డును విధుల నుంచి తప్పించిన జిల్లా ఎస్పీ శ్రీ వి. విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్

**మచిలీపట్నం నవంబర్ 25 లక్ష్యం న్యూస్**

హెూంగార్డ్ 304 B. అజయ్ కుమార్ అసభ్య నృత్యాలు చేస్తూ అనుచిత ప్రవర్తన కలిగి పోలీస్ శాఖ యొక్క ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరించడంతో సదరు హెూంగార్డ్ పై క్రమశిక్షణ చర్యలకు జిల్లా ఎస్పీ శ్రీ వి.విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్., గారు ఉపక్రమించారు. ప్రజారక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ విధుల్లో పాల్గొనవలసిన హెూంగార్డ్ అసభ్య నృత్యాలు చేస్తూ ఆ వీడియోలు సామాజిక మాధ్యమాల వేదికగా విస్తృతంగా వ్యాపించడంతో ఆ విషయం ఉన్నతాధికారుల దృష్టికి రాగా,వాటిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించవలసిందిగా ఎస్పీ గారు సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.వీడియోల ద్వారా ప్రచురితమవుతున్న వార్త నిజ నిర్ధారణ కావడంతో ఈరోజు హెూంగార్డు అజయ్ కుమార్ ను వీధుల నుండి సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా పోలీస్ కార్యాలయం నుండి ఎస్పీ గారు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి పోలీస్ సిబ్బంది, అధికారుల యొక్క ప్రవర్తన పోలీస్ శాఖ యొక్క ప్రతిష్టను పెంచేలా ఉంచాలి గాని అప్రతిష్టకు గురి చేసేలా ఎవరు వ్యవహరించినా వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవడానికి ఏమాత్రం వెనకాడేది లేదని, మంచి విధి నిర్వహణ కనపరిస్తే ఏ విధంగా అభినందిస్తామో, అలాగే విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన అంతే కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ గారు హెచ్చరించారు.

## రైతును రాజుగా చేయటమే ప్రభుత్వం లక్ష్యం

### దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి



**అవనిగడ్డ నవంబర్ 25 లక్ష్యం న్యూస్**

కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతుందని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు పేర్కొ న్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చేపట్టిన 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమాన్ని మంగళవారం అవనిగడ్డ మండలం అశ్వరావుపాలెం గ్రామంలో ప్రారంభించారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను రైతులకు వివరించారు. అనంతరం ప్రచార కరపత్రాలను అన్నదాతలకు అందించారు. ఈ కార్యక్రమంలో దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ ఏఓ శుభ హారిక,అశ్వారావుపాలెం నీటి సంఘాల అధ్యక్షులు దాసినేని శ్రీనివాసరావు,గ్రామ మాజీ సర్పంచ్ కొండవీటి మధు పార్టీ నేతలు దాసినేని సాంబయ్య,రేపల్లె నాగబాబు,కొండవీటి రవి గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**విశాఖపట్టణంలక్ష్యం న్యూస్ , నవంబర్ 25**

గ్రామీణ మండలం చినగదిలిలో ఉన్న ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా మంగళవారం సాయంత్రం గోదాములను సందర్శించిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అక్కడ అధికారులకు, భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పర్యటనలో భాగంగా విజిటింగ్ రిజిస్టర్లో సంతకం చేశారు. స్థానిక రెవెన్యూ, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



**గుంటూరు నవంబర్ 25 (లక్ష్యం న్యూస్)**

చుట్టుగుంట సెంటర్లో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సిపిఐ, అందత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం సాగింది .శిబిరాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి, నగర కార్యదర్శి అరుణ్ కుమార్ ప్రారంభించారు. పరిసర ప్రాంతాలకు చెందిన పేదలు, పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.సిబ్బంది నేత్ర పరీక్షలు నిర్వహించి ,వైద్య సేవలను వైద్యులు అందించారు .ఈ సందర్భంగా మాల్యాద్రి,, అరుణ్ కుమార్ మాట్లాడారు. ఉచిత కంటి వైద్య శిబిరాలను వృద్ధ పేదలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళ్ళకు సంబంధించిన ఎటువంటి సమస్యలు ఉన్న ,ఇటువంటి వైద్య శిబిరాల ద్వారా చికిత్స పొందవచ్చు అని మాల్యాద్రి, అరుణ్ కుమార్ సూచించారు. సమాజ ఆరోగ్య భద్రత కోసం తమ వంతు చేయూతన అందించామనివారు ప్రకటించారు.

## మాదకద్రవ్యాల పై విద్యార్థినిలకు అవగాహనలి

### బాపట్ల క్రైమ్ డిఎస్పి జగదీష్ నాయక్



**బాపట్ల రూరల్ నవంబర్ 25 ( లక్ష్యం న్యూస్)**



బాపట్ల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల కళాశాల నందు విద్యార్థినీలకు బాపట్ల ఈగల్ టీం ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బాపట్ల క్రైమ్ డిఎస్పి జగదీష్ నాయక్ హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ చెడు వ్యసనాలకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకోకూడదని విద్యార్థినిలకు సూచించారు. జాన్ సాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఉపాధ్యాయుల మాట మాట ఉపాధ్యాయుల మాటవినాలి తల్లిదండ్రులను గౌరవించాలి. మహిళా ఆపదలో ఉన్నప్పుడు శక్తి యొక్క ఎంతో ఉపయోగపడుతుందని ప్రతి ఒక్కరు శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని విద్యార్థినిలకు సూచించారు. ఆపద సమయంలో శక్తి ఎంతో ఉపయోగపడుతుందని శక్తి యాప్ ఉంటే మీ వెంట పోలీసు ఉన్నట్టే అని తెలిపారు. మీ ఇంటి వద్ద చుట్టుపక్కల వారు ఎవరైనా గాన్ సాయి అమ్ముతున్నట్టుగాని మీకు తెలిస్తే 1972 కి కాల్ చేయాలని తెలిపారు.సైబర్ నేరాలపట్ల అప్రమత్తం గా ఉండాలని మొబైల్స్ లో ఆన్లైన్ గేమ్స్ ఆధారదని అన్నారు.ఈ కార్యక్రమం లో బాపట్ల క్రైమ్ డిఎస్పీ జగదీష్ నాయక్, ప్రిన్సిపాల్ వెంకట పద్మావతి, ఉపాధ్యాయులు,ఈగల్ టీమ్,విద్యార్థినీలు పాల్గొన్నారు.

# మచిలీపట్నంలో దారుణం.

## తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో అతి కిరాతకంగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్.

**మచిలీపట్నం నవంబర్ 25 లక్ష్యం న్యూస్**

కాగిత కృష్ణవేణి అనే వృద్ధురాలు కాలెఖాన్ పేట, శివగంగ గుడి వద్ద నివాసం ఉంటుంది. భర్త కాగిత వెంకటరత్నం ఫ్లాట్ రిక్షా తొక్కుతూ జీవనం సాగిస్తూ ఉంటాడు. కృష్ణవేణి రాజా గారి సెంటర్ ఆర్ సి హెచ్ హెూటల్ లో పనిచేస్తుంది. ప్రతిరోజు లాగానే తెల్లవారుజామున నాలుగు గంటలకు కాలెఖాన్ పేట వద్ద నుండి రాజా గారి సెంటర్ హెూటల్ కి వెళ్ళడానికి ఆటో ఎక్కింది.... క్రూర మనస్తత్వం కలిగిన ఆటో డ్రైవర్ అతి కిరాతకమైన ఆలోచనతో వృద్ధురాలి మెడలో ఉన్న కాసులపేరీ కోసం అతి దారుణంగా ప్రవర్తించాడు.

పనిపై ఆర్ సి హెచ్ హెూటల్ కి ఆటోలో వెళ్తున్న వృద్ధురాలిని షార్ట్ కట్ లో వెళ్దాం అని చెప్పినా ఆటో డ్రైవర్ కాలే ఖాన్ పేట పాత బైపాస్ రోడ్డు లోకి తీసుకువెళ్లి రాడ్డుతో కిరాతకంగా ,విచక్షణ రహితంగా తలపై బాది మెడలో ఉన్న కాసులపేరీతో పరారయ్యాడు.... గాయాలతో పడి ఉన్న కృష్ణవేణి ను స్థానికులు మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వృద్ధురాలికి ప్రభుత్వాసుపత్రి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఇనుకుదురుపేట పోలీసులు. ఆటో డ్రైవర్ కోసం సిసి ఫుటేజ్ ను పరిశీలించి గాలిస్తున్న పోలీసులు.

# బీపీటీ ధాన్యం కొనుగోలుపై వదంతులు నమ్మవద్దు

- రైతులకు స్పష్టం చేసిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్
- నియోజకవర్గంలో రూ.కోటి 23 లక్షలు విలువ కలిగిన 513 మెట్రిక్ టన్నుల బీపీటీ ధాన్యం కొన్నాం

**మోపిదేవి: నవంబర్ 25 లక్ష్యం న్యూస్**



బీపీటీ ధాన్యం కొనట్లేదనే వదంతులు నమ్మవద్దని, నియోజకవర్గంలో ఇప్పటికి 513 మెట్రిక్ టన్నుల బీపీటీ ధాన్యం కొనుగోలు చేసినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం మోపిదేవి మండలం రావివారిపాలెం, వెంకటాపురం, పెద్దకళ్లేపల్లి గ్రామాల్లో రైతులను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కలిశారు. రావివారిపాలెంలో రైస్ మిల్లు సందర్శించి, అక్కడ ఉన్న రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు గురించి వారితో మాట్లాడారు. బీపీటీ బియ్యం సక్రమంగా కొనుగోలు చేస్తున్నట్లు రైతులు, మిల్లర్ తెలిపారు. మిల్లులో డ్రయ్యర్ల సౌకర్యం, ముఠా సౌకర్యం పరిశీలించిన ఎమ్మెల్యే రైతులకు మేలు చేసేలా సాధ్యమైనంత వేగంగా ధాన్యం కొనుగోలు చేయాలని మిల్లరుకు సూచించారు. వెంకటాపురంలో రైతు సేవా కేంద్రం వద్ద సిబ్బంది, రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పరిశీలించారు. రైతన్నా మీకోసం కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం పెద్దకళ్లేపల్లి దేవస్థానం వద్ద ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులతో మాట్లాడి బీపీటీ బియ్యం కొనుగోలు అంశంలో వారి అపోహలు తొలగించి సందేహాలు నివృత్తి చేశారు.

వీఆర్ఓ గ్రామంలో బీపీటీ ధాన్యం ఎంతమంది రైతుల దగ్గర ఉందనే జాబితా తయారు చేయాలని, వారందరి దగ్గర బీపీటీ ధాన్యం ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి జాబితా తయారు చేయాలని ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బందికి సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేని గ్రామాల్లో ఉన్న గ్రామ సచివాలయాల సిబ్బందిని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పంపి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 1,04,064 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా, ఇప్పటికే 1,037 మంది రైతుల నుంచి రూ.16.89 కోట్లు విలువైన 7,468 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులకు రూ.16.81 కోట్లు జమ చేసినట్లు వివరించారు. ఇందులో బీపీటీ ధాన్యం రూ.కోటి 23 లక్షలు విలువ కలిగిన 513 మెట్రిక్ టన్నుల ధాన్యం నియోజకవర్గంలో కొనుగోలు చేసినట్లు వివరించారు. జిల్లాలో రూ.5.80 కోట్లు విలువ కలిగిన 2,500 మెట్రిక్ టన్నుల బీపీటీ ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు. బీపీటీ ధాన్యం గురించి ఎలాంటి వదంతులు రైతులు నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.హరనాథ్, ఏవో హెప్సిబా రాణి, పీఏసీఎస్ చైర్మన్లు పరుచూరి శ్రీనివాసరావు, అరజా రాధిక, సర్పంచ్ తుమ్మా సోములమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

# మోపిదేవి దేవస్థానం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్



- షష్టి కల్యాణ మహెూత్సవం ప్రారంభించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్
- స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్- విజయలక్ష్మి దంపతులు



**మోపిదేవి: నవంబర్ 25 లక్ష్యం న్యూస్**

మోపిదేవి దేవస్థానం మరింత అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా భాసిల్లుతూ భక్తులచే విశేష పూజలు అందుకుంటున్న మోపిదేవి శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం షష్టి కళ్యాణ మహెూత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ – విజయలక్ష్మి దంపతులు విచ్చేశారు. వారికి దేవస్థానం వేద పండితులు ఘన స్వాగతం పలికారు. బ్రహ్మశ్రీ కొమ్మూరి ఫణి కుమార్ శర్మ, ప్రధాన అర్చకులు బుద్దు పవన్ కుమార్ శర్మ, ఘనాపాటి నౌదూరి విశ్వనాథ సుబ్రహ్మణ్య శర్మ, ముఖ్య అర్చక బుద్దు సతీష్ శర్మ, పలువురు పండితుల వేద మంత్రాల నడుమ బుద్ధప్రసాద్ – విజయలక్ష్మి దంపతులు, దాసరి శ్రీరామ వరప్రసాదరావులు స్వామి వారి పుట్టలో పాలు పోసి, పట్టు వస్త్రాలను స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. ఈ సందర్భంగా వేద పండితులు స్వామివారిని పెండ్లి కుమారునిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. షష్టి కల్యాణ మహెూత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో నిత్యం నిర్వహించే ఆర్జిత సేవలను మూడు రోజులపాటు తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల – 2026 క్యాలెండరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దిన దిన ప్రవర్ధమానంగా అభివృద్ధి చెందుతున్న మోపిదేవి పుణ్యక్షేత్రమునకు వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. దేవస్థానం ఎదుట నిర్మిస్తున్న వసతి గదులు, షాపింగ్ కాంప్లెక్స్ త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. భక్తుల కోసం నూతనంగా కేశ ఖండనశాల, టాయిలెట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ అచ్యుత మధుసూధనరావు, దేవస్థానం అధికారులు కేశవ, కిషోర్, పయ్యావుల నాగరాజు, సీఐ కే.ఈశ్వరరావు, ఎస్ఐ పీ.గౌతమ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# చలికాలం జాగ్రత్తలు పాటించాలి..! డా. అనూష

**మంగలగిరి నవంబర్ 25 ( లక్ష్యం న్యూస్)**



చలికాలంలో ఆరోగ్య సమస్యలు దరి చేరకుండా, చలి నుండి శరీరాన్ని కాపాడుకుంటూ, ప్రజలు తగు జాగ్రత్తలు పాటిస్తూ, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మంగళగిరి గణపతి నగర్లోని ఇందిరానగర్ యూపీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష అన్నారు. చలి కాలంలో వచ్చే ఆరోగ్య సమస్యలు, వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆమె వివరించారు. చల్లని చలికాలం ఆరోగ్యంపై చాలా ప్రభావాన్ని చూపుతోందన్నారు. శీతాకాలంలో దగ్గు, జలుబు, గొంతు నొప్పి, వైరల్ జ్వరాలు, ఆస్తమా, చర్మం పొడిబారి పోవడం వంటివి ఎక్కువగా వస్తాయన్నారు. చలికాలంలో తేమ శాతం బాగా తగ్గిపోవడంతో చర్మంలోని తేమ ఇగిరి పోయి, చర్మం పొడిబారి పోతుందన్నారు. పెదవులు, చెంపలు చిట్లిపోవడం, కాళ్లు, చేతులలో పగుళ్ల రావడం, దురద పెట్టడం వంటి సమస్యలు వస్తాయన్నారు. పొడి బారిన చర్మంకు మాయిశ్చరైజర్ క్రిములు, కొబ్బరి నూనె రాయాలన్నారు. ద్రాహం వేసిన, వేయకపోయిన నీరు ఎక్కువగా త్రాగాలన్నారు. గోరువెచ్చటి నీటితో స్నానం చేయాలన్నారు. చలికాలంలో రక్తనాళాలు, ధమనులు సంకోచించి బీపీ పెరిగి గుండెపోటుకు గురి అయ్యే ప్రమాదాలు ఉన్నాయన్నారు. చలికి కీళ్లు బిగిసిపోయి కదలికలు కష్టంగా చేస్తాయని, దాన్ని నివారించేందుకు కీళ్లను తరచూ కదలిస్తుండాలన్నారు. చలికాలం జీర్ణశక్తి మందగిస్తుందని కూరగాయలు, పండ్లు తీసుకుంటూ కొవ్వులు, పాల ఉత్పత్తులు, మాంసం, తక్కువగా తీసుకోవాలన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధులు, ఊపిరితిత్తులు, ఆస్తమా రోగులు మంచు పడే సమయంలో బయటికి వెళ్లకుండా ఉండాలన్నారు. పిల్లల చర్మం సున్నితంగా ఉండటం వల్ల చలి మరంతగా వేధిస్తుందని, శరీరాన్ని ఆలివ్ ఆయిల్, కొబ్బరి నూనెతో మసాజ్ చేయాలన్నారు. గోరువెచ్చటి నీటితో స్నానం చేయించి కొద్దిగా తడిగా ఉన్న శరీరంపై మాయిశ్చరైజర్ క్రీమ్ పెట్టాలన్నారు. తెల్లవారుజామున పొగ మంచు ఎక్కువగా ఉంటుందని సూర్యోదయం తర్వాత వాకింగ్, వ్యాయామం చేసుకోవాలన్నారు. చలి నుండి రక్షణ పొందటానికి ఉన్ని దుస్తులు, స్వెటర్లు, మాస్కులు, మఫ్లర్లు వాడాలన్నారు. శీతాకాలం సీజనల్ వ్యాధులతో బాధపడేవారు సమీపంలోని హెల్త్ సెంటర్లో ప్రభుత్వం అందించే ఉచిత వైద్య సేవలను పొందాలని డాక్టర్ అనూష విజ్ఞప్తి చేశారు.

ప్రజా చైతన్యమే...
లక్ష్యం
తెలుగు దినపత్రిక
బుధవారం ,26-11-2025

## మంత్రి నారా లోకేష్ సహకారంతో
# 30 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ

- స్త్రీ శక్తి సంక్షేమం పేరుతో మహిళలకు ఉచితంగా శిక్షణ, కుట్టు మిషన్లు అందిస్తున్న మంత్రి నారా లోకేష్
- శిక్షణ పొందిన "74"వ బ్యాచ్ మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు, సర్టిఫికేట్స్ పంపిణీ
- కుట్టుమిషన్లు, సర్టిఫికేట్స్ పంపిణీ చేసిన నియోజకవర్గ తెలుగు మహిళలు



**మంగళగిరి నవంబర్ 25 ( లక్ష్యం న్యూస్)**

మానవవనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా దుగ్గిరాల మండలంలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది మహిళలకు మంగళవారం ఉచితంగా కుట్టుమిషన్లు, సర్టిఫికేట్స్ పంపిణీ చేశారు. 74వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన మహిళలకు టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో నియోజకవర్గ తెలుగు మహిళలు కుట్టుమిషన్లు అందజేశారు. లబ్ధిదారులు మంత్రి నారా లోకేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే మంత్రి నారా లోకేష్ లక్ష్యమని అన్నారు. అందులో భాగంగానే మంత్రి నారా లోకేష్ నియోజకవర్గ వ్యాప్తంగా శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లు అందజేస్తున్నారని చెప్పారు. మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులేస్తేనే వారి కుటుంబంతో పాటు సమాజం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు, ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మీ, దుగ్గిరాల ఎంపీపీ షేక్ జబీన్, దుగ్గిరాల మండల టీడీపీ అధ్యక్షురాలు కేసంనేని శ్రీ అనిత, రాష్ట్ర తెలుగు మహిళా కార్యదర్శి వింజమూరి ఆశాబాల, మంగళగిరి నియోజకవర్గ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మంచికలపూడి వైష్ణవి, దుగ్గిరాల మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు యార్లగడ్డ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు ఉన్నందునే సకాలంలో
# రైతుల ఉత్పత్తులు కొనుగోళ్లు, మద్దతు ధర



**నాదెండ్ల నవంబర్ 25లక్ష్యం న్యూస్**

మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాలతో మండలం లోని ఆమెన్ సాహెబ్ పాలెం లో కూటమిప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గుర్రం నాగపూర్ణ చంద్రరావు మాట్లాడుతూఅపరాలు, ఉద్యాన, కూరగాయల పంటల సాగుతో ఎక్కువ లాభాలు వస్తాయని, ఆ దిశగా రైతులు వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలన్నారు. రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా తమ ఇళ్లకు వచ్చే వ్యవసాయ సిబ్బంది సేవల్ని రైతాంగం సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ప్రారంభించి గ్రామంలోని రైతుల ఇళ్లకు వెళ్లి ముఖ్యమంత్రి రైతాంగానికి రాసిన లేఖతో పాటు, ప్రభుత్వం అమలుచేయాలనుకుంటున్న నూతన సాగువిధానాలు.. అందించే సబ్సిడీలు, ప్రోత్సాహకాలను వారికి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 27న నూర్ మసీద్ ను ప్రారంభించనున్న మంత్రి లోకేష్...



**మంగళగిరి నవంబర్ 25 ( లక్ష్యం న్యూస్ )**

మంగళగిరి ఆర్టీసీ డిపో వద్ద పావురాల కాలనీలో సుమారు రెండు కోట్ల రూపాయలు వ్యయంతో నూతనంగా నిర్మాణం జరిగిన నూర్ మసీద్ ను ఈనెల 27వ తేదీన ప్రారంభించడం జరుగుతుందని హాజీ షేక్ నాగుల మీరా, మసీదు వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ మహమ్మద్ అలీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మసీదులో దీనికి సంబంధించిన మరిన్ని వివరాలను వారు వివరించారు. ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే అండ్ రాష్ట్ర ఐటీ, విద్య, మానవ వనరులు శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ హాజరై మసీదును ప్రారంభిస్తారన్నారు. తమ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. గౌతమ బుద్ధ రోడ్డులో 14 సంవత్సరాలు నుంచి ఉన్న మసీదు ను రోడ్డు విస్తరణలో తొలగించి, తిరిగి ప్రభుత్వం ఏడు సెంట్లు స్థలం కేటాయించడం జరిగిందన్నారు. సుమారు రెండు కోట్ల రూపాయల వ్యయంతో ఆధునిక వసతులతో లిఫ్ట్ సౌకర్యంతో మూడు అంతస్తులలో మసీదు నిర్మాణం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ ప్రతినిధులు షేక్ మహమ్మద్ జానీ, మహమ్మద్ ఫిరోజ్, షేక్ సౌఖత్ అలీ, షాహిద్ అలీ, జాఫర్, నజీర్, ఆసిఫ్, అబ్దుల్లా కుట్టి పాల్గొన్నారు.

## ఆసుపత్రి దుస్థితిపై కమిషనర్ కు వినతి పత్రం
# చిన్న వాల్తేరు రాంనగర్ సమస్యలను వెంటనే పరిష్కరించండి

**విశాఖపట్నం లక్ష్యం న్యూస్ నవంబర్ 25**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'స్వస్త్ నారీ – సశక్త్ పరివార్' వైద్య శిబిరాల పర్యవేక్షణలో భాగంగా నగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్లలో (యూ పి హెచ్ సి ) గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ జిల్లా మెడికల్ సెల్ కన్వీనర్ కె.వి. వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు ఎం.ఎం.ఎన్ పరశురామరాజు మంగళవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చినవాల్తేరు యూపీహెచ్సీ లో వైద్య సిబ్బంది, మందులు, రక్త పరీక్షల సౌకర్యాలు అన్నీ అందుబాటులో ఉన్నప్పటికీ, ఆ భవనంలోని ప్రతి గదికి తీవ్రంగా చెదలు పట్టడం ఆందోళనకరంగా మారిందన్నారు. దీనివల్ల అక్కడున్న విలువైన మందులు, ల్యాబ్ పరికరాలు పాడైపోతున్నాయని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే రామ్‌నగర్ ఏరియా యూపీహెచ్సీ సి కి కూడా పూర్తి స్థాయి సిబ్బంది, మందులు మంజూరైనప్పటికీ, ఆసుపత్రికి నేటికీ శాశ్వత భవనం లేదన్నారు. భవనం లేని కారణంగా రామ్‌నగర్ ఆసుపత్రికి సంబంధించిన సామాగ్రిని కూడా చినవాల్తేరు యూ పి హెచ్ సి లోనే భద్రపరచాల్సి వస్తోందని, దీనివల్ల సేవలకు తీవ్ర ఆటంకం కలుగుతోందని వివరించారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలు వైద్యం కోసం ఇబ్బంది పడకూడదని, వెంటనే చినవాల్తేరు ఆసుపత్రిలో చెదల సమస్యను నివారించి, రామ్‌నగర్ ఆసుపత్రికి తక్షణమే శాశ్వత భవనాన్ని కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన కమిషనర్, తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# నెరవేరుతున్న మత్స్యకారుల కళ



- ❖సాగర్ క్యాంపు లో శరవేగంగా రహదారి నిర్మాణ పనులు
- ❖పనులను పరిశీలించిన అధికారులు, కూటమి నేతలు

**విజయపురిసౌత్ : 25 నవంబర్ ( లక్ష్యం న్యూస్)**

గత ఆరు దశాబ్దాలుగా అభివృద్ధి కి నోచుకోని విజయపురిసౌత్ లోని సాగర్ క్యాంపు మత్స్యకారుల కాలనీ కి ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కృషితో మహర్దశ పట్టింది.సాగర్ ప్రాజెక్ట్ కాలనీ రహదారుల అభివృద్ధి కి 5 కోట్లు మంజూరు కావడంతో సాగర్ క్యాంపు మత్స్యకారుల కాలనీ లో సీసీ రోడ్డు నిర్మాణం పనులు ఊపందుకున్నాయి.రహదారి నిర్మాణ పనులను మంగళవారం ఇరిగేషన్ అధికారులు,కూటమి నేతలు పరిశీలించారు. సుమారు 2.5 కిలో మీటర్ల మేర సీసీ రోడ్డును నిర్మిస్తుండటం తో మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.మరో 20 రోజుల్లో రహదారుల నిర్మాణం పూర్తి అవుతుందని కాంట్రాక్టర్ ప్రసాద్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డి ఈ మురళీధర్,ఏ ఈ సుధాకర్,వర్క్ ఇన్స్పెక్టర్ అబ్దుల్,మత్స్యకారులు సంఘం అధ్యక్షుడు మైలపల్లి అప్పలరాజు,ఎరిపల్లి వెంకటేశ్వర్లు, దేవుడు,గంటా ధనుంజయ రావు,సింహాద్రి తదితరులు ఉన్నారు.

## ప్రతిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం.




**చిలకలూరిపేట నవంబర్ 25 లక్ష్యం న్యూస్**

పట్టణంలో గత ఆదివారం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రతిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా ఆర్టీసీ ఉద్యోగులు మరియు వృద్ధుల కోసం కంటి వైద్య శిబిరంనిర్వహించారు.ఈ శిబిరంలో శంకర వైద్యశాల వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు.పరీక్షల్లో కంటి ఆపరేషన్ అవసరమని తేలిన వారిని శంకర వైద్యశాలలో శస్త్రచికిత్స కోసం ఎంపిక చేసి, సురక్షితంగా ఆస్పత్రికితరలించారు. శస్త్రచికిత్స పూర్తయినఅనంతరం రోగులను క్షేమంగా తిరిగి చిలకలూరిపేటకు తరలించి,ఆర్టీసీ బస్టాండ్ వద్ద వారి గమ్యస్థానాలకు సౌకర్యవంతంగా చేర్చేలా శ్రద్ధ చూపారు.ఈ శిబిరం సఫలీకృతం కావడానికి క్యాంపు కన్వీనర్ కంచర్ల శ్రీనివాసరావు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీ ఉద్యోగులు మరియు వృద్ధులు ఈ సేవలపైసంతోషం వ్యక్తం చేశారు.

## మంగళగిరిలో మెగా జాబ్ మేళా
# పోస్టర్ విడుదల



**మంగళగిరి నవంబర్ 25 ( లక్ష్యం న్యూస్)**

గుంటూరు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా మంగళగిరి V.T.J.M & I.V.T.R డిగ్రీ కళాశాలలో నవంబర్ 29న నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు అందించేందుకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేపట్టిందని పేర్కొన్నారు.జాబ్ మేళాలో 10కు పైగా కంపెనీలు పాల్గొననున్నాయని, మొత్తం 262 మందికి పైగా ఖాళీలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, B.Tech వంటి అర్హతలున్న 18 నుండి 25 ఏళ్ల మధ్య వయస్సు గల నిరుద్యోగులు అవసరమైన ఆధార్, సర్టిఫికేట్లు, ఫోటోలు, బయోడేటాతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావచ్చని పేర్కొన్నారు. ఎంపికయ్యే వారికి నెలకు 10,000–30,000 వరకు వేతనాలు లభించనున్నాయి. జాబ్ మేళా వివరాలు:తేదీ: 29–11–2025సమయం: ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకుస్థలం: V.T.J.M & I.V.T.R డిగ్రీ కళాశాల, మంగళగిరి .రిజిస్ట్రేషన్ కోసం అభ్యర్థులు నైపుణ్యం పోర్టల్ (naipunyam.ap.gov.in) ద్వారా నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. అదనపు వివరాల కోసం 8074597926, 7780588993, 9347372996 నంబర్లను సంప్రదించవచ్చు. స్థలంలోనే ప్రత్యక్ష రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

## మహిళలు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి




**మాచర్ల నవంబర్ 25 లక్ష్యం న్యూస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మహిళలపై హింస, నిర్మూలనఅంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలికల వసతి గృహం నందు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల న్యాయ సేవ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ కళ్యాణ్ మాట్లాడుతూ సమాజంలో నానాటికి మహిళలపై అనేక రకాల హింస జరుగుతూనే ఉందని అనేక చట్టాలు వచ్చినప్పటికీ మహిళలు ఎంసెట్ గురవుతూ ఉండటం దురదృష్టకరమన్నారు. మహిళలు తమ రక్షణ కోసం ఉన్నటువంటి చట్టాలను వినియోగించుకొని తమను తాను రక్షించుకోవడానికి ప్రయత్నించాలని కోరారు. న్యాయవాదుల సంఘం మాచర్ల అధ్యక్షులు వై రమేష్ బాబు మాట్లాడుతూ ఇప్పటికీ మహిళలపై అనేక రకాలుగా ఆకృత్యాలు జరగటం దురదృష్టకరమని మహిళలు తమ హక్కులను వినియోగించుకొని చట్టపరమైనటువంటి తమన రక్షించుకోవడమే కాకుండా తమ తోటి మహిళలకు కూడా న్యాయం చేకూర్చాలని ప్రయత్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి పి అనిల్ కుమార్, న్యాయవాది జీ వరప్రసాద్, హాస్టల్ వార్డెన్ జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and owned by CHALLA MADHUSUDHANA RAO,and Printed at VEERENDRA GRAPHICSD.NO.8-25-33, NTR Nagar, 2nd Line, Guntur - 522001. Guntur Dist, A.P. and Published at D.No.8-25-33, NTR Nagar, 2nd Line, Guntur - 522001, Guntur Dist, A.P. R.N.I. No. APTEL/2013/48712 Editor : CHALLA MADHUSUDHANA RAO